ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 42.0
కనిష్ఠం : 25.0



కైకలూరు మండలం కొట్టాడలో ఉప్పుటేరు ఆక్రమణలను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

ఉప్పుటేరు ఆక్రమణలు తొలగించాలి

- వారం రోజులే రైతులకు గడువు.. లేకుంటే మేమే రోబో అవతారం ఎత్తుతాం
- డిప్యూటీ స్పీకర్ రఘురామ హెచ్చరిక

కైకలూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి):'ఉప్పుటేరు ఆక్రమణలు తొలగించకపోతే కొంప కొల్లేరే అనే నానుడి కచ్చితంగా జరుగుతుంది. ఉప్పుటేరు 237 మీటర్లు వెడల్పు ఉండాలి. కాని 60శాతం ఆక్రమణలకు గురైంది. చేపలు, రొయ్యల చెరువులన్నీ రైతులే స్వచ్ఛందంగా వారంలోగా తొలగించుకోవాలి. లేదంటే మేమే రోబో అవతారం ఎత్తి ప్రభుత్వ సహకారంతో చెరువులను తొలగిస్తాం' అంటూ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు హెచ్చరించారు. కైకలూరు మండలం కొట్టాడ, జంగంపాడు, పల్లిపాలెం ప్రాంతాల్లో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌తో కలిసి ఉప్పుటేరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'విజయవాడ వరదలకు ప్రధానంగా ముంపు సమస్య ఉప్పుటేరు, కొల్లేరు ప్రాంతమే. దీని ప్రక్షాళనతోనే ముంపు నివారణ చేయగలుగుతాం. ఉప్పుటేరు ఆక్రమణలు తొలగిస్తేనే కొల్లేరు క్షేమంగా ఉంటుంది. లేకుంటే ముంపుతో వచ్చే ఇబ్బందులను ఎవరూ ఊహించలేం. డ్రోన్ కెమెరాల సహాయంతో ఏ మేరకు ఆక్రమణలు గురైందో పరిశీలిస్తున్నాం. వీటి ఫొటోల ఆధారంగా జిల్లా కలెక్టర్లకు చూపించి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తాం. వర్షాకాలంలో చెరువులు ఆక్రమణలు తొలగించడం కష్టం. ముందుగానే జాగ్రత్తపడి తొలగించాలి. ఉప్పుటేరు వెంబడి అక్రమ ఇళ్ల నిర్మాణాలు సైతం తొలగించాలి. వారికి ప్రభుత్వం తరపున మరోచోట స్థలాలను కేటాయించి ఇళ్ల నిర్మాణాలకై రూ.2.9 లక్షలు నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటాం' అని తెలిపారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ అనేక డ్రెయిన్ల ద్వారా ఏలూరు,

(మిగతా 8వ పేజీలో)

తాకట్టు తకరారు

'బంగారం తాకట్టు పెట్టిన సమయం దాటిపోతోంది. త్వరగా వచ్చి సొమ్ములు చెల్లించి, మీ బంగారాన్ని విడిపించుకోండి. లేకపోతే వేలానికి వెళ్లిపోతుంది' అని ఒకప్పుడు బంగారం వ్యాపారులు తాకట్టు పెట్టిన వ్యక్తికి ఒకటికి రెండుసార్లు ఫోన్‌లు చేసినా విడిపించుకునేవారు కాదు. నోటీసులు ఇచ్చినా స్పందించేవారు కాదు. కాని ఇప్పుడు పరిస్థితి మారింది. బంగారం ధర ఒక్కసారిగా పెరగడంతో సామాన్యులు తాకట్టు బంగారం విడిపించుకోవడానికి షాపుల వద్దకు క్యూ కడుతున్నారు. బంగారంపై తాము తీసుకున్న అసలు, వడ్డీ చెల్లిస్తాం. బంగారం ఇవ్వాలంటున్నారు. అయితే బంగారం మీద అప్పు ఇచ్చిన వర్తకుడు గడువు దాటిపోవడంతో వేలం వేసేశామని చెప్పడంతో గొడవలకు దిగుతున్నారు. ఈ పరిస్థితి దాదాపు అన్ని పట్టణాల్లోనూ కనిపిస్తోంది.



- బంగారం విడిపించుకునేందుకు వ్యాపారులతో ఘర్షణ
- ధర పెరగడంతో కొందరు తాకట్టులో విడిపించి విక్రయం
- మరికొందరు ఏళ్లనాటి తాకట్టు వస్తువులు ఏమయ్యాయంటూ ప్రశ్నలు
- షాపుల వద్ద ఘర్షణలు.. తలలు పట్టుకుంటున్న బంగారు వ్యాపారులు

భీమవరం క్రైం/ఆకివీడు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబంలో ఏటా ఎంతో కొంత బంగారం కొనుగోలు చేసేవారు. ఇంతలో ఇంటిలో ఏదైనా అత్యవసర పనిపడితే అదే బంగారాన్ని మార్వాడీ వద్ద తాకట్టు పెట్టి అప్పులు తెచ్చుకునేవారు. డబ్బులు సర్దుబాటు అయిన తర్వాత వడ్డీలు కట్టి విడిపించుకునేవారు. ఈ తంతు కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతూనే వుంది. అప్పట్లో బంగారం ధర నిలకడగా ఉండేది. ఒక్కసారి ధర పెరిగిందంటే ఏడాదిపాటు అదే ధర కొనసాగేది. దీంతో అటు తాకట్టు పెట్టినవారికి, ఇటు వ్యాపారులకు అంత ఒత్తిడి ఉండేది కాదు. ప్రస్తుతం బంగారం ధర చుక్కలను అంటడంతో తాకట్టు పెట్టిన వారు పరుగులు పెడుతున్నారు. తాకట్టు పెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు కాసుకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పెరగడంతో కొందరైతే తాకట్టు విడిపిస్తున్నారు. మరికొందరైతే వస్తువుకు ధర కట్టి అసలు, వడ్డీ పోను మిగిలిన డబ్బులు ఇవ్వమంటూ వ్యాపారులపై ఒత్తిడి చేస్తున్నారు. వ్యాపారులు ఒకరోజు ఉన్న ధర మరో రోజు ఉండకపోవడంతో బంగారాన్ని కొనుగోలు చేస్తే ఏమవుతుందోనన్న ఆలోచనలో పడుతున్నారు.

వ్యాపారాలు తగ్గడంతో దుకాణాలు డల్

బంగారం ధర ఒక్కసారిగా పెరగడంతో వ్యాపారం తగ్గిపోయింది. ధరలో గంట గంటకు మార్పులు వస్తుండడంతో కొనుగోళ్లు తగ్గిపోయాయని వర్తకులు చెబుతున్నారు. ఫలితం దుకాణం అద్దె, కరెంటు బిల్లు, వర్కర్లకు జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఇది చాలదన్నట్లు తాకట్టు పెట్టినవారు ఒక్కసారిగా వచ్చి వస్తువులను విక్రయించడానికి వస్తుండంతో వ్యాపారులు ఆలోచనలో పడ్డారు. మరోవైపు నాలుగేళ్ల క్రితం తాకట్టు పెట్టినవారు తమ వస్తువులు కావాలంటూ ఇప్పుడు ఒత్తిడి చేస్తున్నారు. అసలు వాస్తవానికి ఏదైనా వస్తువ తాకట్టు పెట్టుకుంటే ఏడాది నుంచి ఏడాదిన్నర వరకే అవి ఉంటాయని, తాకట్టు ధ్రువపత్రాల్లో నిబంధనల్లో పేర్కొంటారు. ఏడాదిలోపు వచ్చి వడ్డీ చెల్లిస్తే ఆ తాకట్టును మళ్లీ తిరిగి రాసి మళ్లీ ఏడాదిపాటు యథావిధిగా కొనసాగిస్తారు. కొందరు కొనుగోలుదారులు అప్పట్లో ధర లేకపోవడంతో వస్తువులు విడిపించుకోలేని స్థోమత అంతంతమాత్రంగా ఉండటంతో వీటిని తీసుకుని వెళ్లేవారు కాదు. దీంతో వ్యాపారులకు నోటీసులు పంపించి వేలానికి పంపించేవారు. అయితే ప్రస్తుతం వచ్చి మా వస్తువులు కావాలంటూ వ్యాపారులను నిలదీస్తూ ఉండటంతో వీరు తలలు పట్టుకుంటున్నారు. వస్తువులు లేకపోయినా ఆ రశీదును బట్టి తూకాన్ని చూపించి ధరలు కట్టి మిగిలిన సొమ్మును తాకట్టు పెట్టిన వారికి ఇవ్వాల్సి వస్తోంది. ఇలా చేయడం వల్ల వ్యాపారులకు నష్టం వాటిల్లుతుందని చెబుతున్నారు.

- ఇటీవల భీమవరం మండలానికి చెందిన ఒక మహిళ పట్టణంలోని ప్రముఖ బంగారు దుకాణాల వద్దకు వచ్చింది. తాను కరోనా సమయంలో ఐదు కాసులు బంగారు వస్తువులు రెండు లక్షల రూపాయలకు తాకట్టు పెట్టానని, ఆ వస్తువులు బయటకు తీయండంటూ యజమానిని కోరింది. అయితే యజమాని మీకు నోటీసులు వచ్చాయా అని అడిగాడు. తాకట్టు పెట్టిన ఏడాది అనంతరం నోటీసులు వచ్చినట్లు ఆమె పేర్కొంది. అయితే దుకాణ యజమాని మాత్రం ఆ వస్తువు వేలానికి వెళ్లిపోయింది.. ప్రస్తుతానికి ఏమీ లేదని తెలపడంతో ఆ మహిళ బంధువులను పిలిపించి ఆ దుకాణం వద్ద పెద్ద రాద్ధాంతం చేసింది. చివరకు చేసేది లేక ఆ వస్తువుకు ప్రస్తుతం ఉన్న ధర ప్రకారం రేటు కట్టి మిగిలిన సొమ్మును ఆ మహిళకు ఇవ్వాల్సి వచ్చింది. దీంతో ఆ వ్యాపారి బాగా నష్టపోయాడు.
- ఉండి మండలానికి చెందిన ఒక మహిళ ఏడాది క్రితం భీమవరం పట్టణంలో ఒక దుకాణంలో మూడు కాసుల బంగారు వస్తువులను తాకట్టు పెట్టింది. ఏడాది తర్వాత వచ్చి ఆ వస్తువును విడిపించింది. అయితే తాను పెట్టిన వస్తువుకు మూడు కాసులు కాదు నాలుగు కాసులంటూ యజమానితో గొడవకు దిగింది. ఆ మహిళ సంతకాలు ఆ తేదీని బట్టి చూపించడంతో తనకు చదువు లేదని తెలియక సంతకం పెట్టానంటూ చెప్పడంతో యజమాని సంఘ సభ్యులను పిలిపించి ఆమెకు నచ్చచెప్పారు. ఇటీవల కాలంలో భీమవరం పట్టణంతోపాటు నరసాపురం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు వంటి పట్టణాల్లో కూడా ఇటువంటి ఘటనలే చోటు చేసుకున్నాయి.




కార్యక్రమంలో ప్రసంగిస్తున్న హైకోర్టు జడ్జిలు జస్టిస్ మన్మథరావు, జస్టిస్ కృపాసాగర్.. పాల్గొన్న న్యాయమూర్తులు

కేసులు త్వరితగతిన పరిష్కరించాలి

- హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మన్మథరావు, జస్టిస్ డాక్టర్ కృపాసాగర్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : న్యాయమూర్తులు కేసులను త్వరితగతిన విచారించి కేసులు పెండింగ్ లేకుండా సత్వర చర్యలు చేపట్టాలని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.మన్మథరావు, జస్టిస్ డాక్టర్ వీఆర్‌కే కృపాసాగర్‌లు సూచించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని కోర్టులలో పనిచేస్తున్న న్యాయమూర్తులకు ఏలూరు జిల్లా కోర్టు కాన్ఫరెన్సుహాలులో నూతన చట్టాలపై శనివారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తులు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మారుతున్న చట్టాలపై న్యాయమూర్తులు నైపుణ్యం పెంచుకోవాలన్నారు. వర్క్‌షాపుల ద్వారా కొత్తకొత్త విషయాలను తెలుసుకోవడం వల్ల కేసులను త్వరితగతిన పరిష్కరించడానికి దోహదపడతాయన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సిరిపురం శ్రీదేవి మాట్లాడుతూ 2025లో మొదటి వర్క్‌షాపు నిర్వహిస్తున్నామన్నారు. అనుభవజ్ఞులైన న్యాయమూర్తుల చేత ఇటు వంటి శిక్షణ తరగతులు నిర్వహించడం వల్ల జూనియర్ న్యాయమూర్తులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విశ్రాంతి జిల్లా న్యాయమూర్తి, రిసోర్స్ పర్సన్ వైవీ రామకృష్ణ, అదనపు జిల్లా జడ్జి ఎం.రామకృష్ణంరాజు, న్యాయమూర్తులు, పలువురు పాల్గొన్నారు.

కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపండి : సీపీఎం

లోపలి పేజీలో..



వ్యవసాయ పరికరాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే ధర్మరాజు

రాయితీపై వ్యవసాయ పరికరాలు

- కలెక్టర్ వెట్రిసెల్వి

ఉంగుటూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 1400 మంది రైతులకు 50 శాతం రాయితీతో రూ.3.94 కోట్ల విలువైన వ్యవసాయ పరికరాలను పంపిణీ చేసినట్టు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. నారాయణపురంలోని ఎమ్మెల్యే నూతన క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుతో కలిసి కలెక్టర్ రూ.77 లక్షల రాయితీతో కూడిన వ్యవసాయ పరికరాలను 115 మంది రైతులకు పంపిణీని చేశారు. ఆమె మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్‌లో సూక్ష్మ పోషకాలు పూర్తి రాయితీతో అందిస్తామన్నారు. ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ ఐదేళ్ల తర్వాత వ్యవసాయ పరికరాలు రైతులకు అందించడం శుభ పరిణామమన్నారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, సర్పంచులు బండారు సింధు, దిడ్ల అలకనంద, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో రాజ్ మనోజ్, భీమడోలు ఏడీఏ ఉషా రాజకుమారి, మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం చేబ్రోలు ఇసుక స్టాక్ పాయింట్ ఎమ్మెల్యే ధర్మరాజుతో కలసి కలెక్టర్ పరిశీలించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, చుట్టూ కంచె వేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. జిల్లాలో ఇసుక నిల్వ కేంద్రాల వద్దకు రవాణా, నిల్వ చేసి వాహనాల్లో లోడింగ్ చేయడానికి లాటరీ పద్ధతిలో ఏజన్సీని నియమిస్తామన్నారు. అనంతరం చేబ్రోలులో మెరుగైన పారిశుధ్యం కోసం తీసుకోవాల్సిన చర్యలపై సర్పంచి రాంధే లక్ష్మీ సునీతతో సమీక్షించారు.

జిల్లా అంతటా
స్లాట్ రిజిస్ట్రేషన్లు

- కొత్తగా 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రారంభం



జంగారెడ్డిగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తొలి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ అందిస్తున్న సబ్ రిజిస్ట్రార్

ఏలూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : భూములు, ప్లాట్‌ల రిజిస్ట్రేషన్లు సులభతరంగా చేసేందుకు 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో శనివారం ప్రారంభమైన స్లాట్ బుకింగ్ విధానం విజయవంతమైంది. తొలిరోజు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా 11 కార్యాలయాల్లో 87 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లను సబ్ రిజిస్ట్రార్లు పూర్తి చేశారు. భీమడోలులో 5, చింతలపూడి-18, జంగారెడ్డిగూడెం-7 కామవరపుకోట-13, పోలవరం-4, గణపవరం-7, వట్లూరు- 7, కైకలూరు-7 మండవల్లి-5 ముదినేపల్లి-2, నూజివీడు 12 చొప్పున డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. ఏలూరులోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో అత్యధికంగా మరో 34 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 121 రిజిస్ట్రేషన్లతో రూ.58.85 లక్షల ఆదాయం సమకూరింది. జిల్లా అంతటా స్లాట్ విధానం అమల్లోకి రావడంతో ఇకపై కక్షిదారుల సమస్యలకు చెక్ పడనుంది. సకాలంలో రిజిస్ట్రేషన్లు సవ్యంగా సాగడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరిగే అవకాశం ఉంది. మధ్య దళారీ వ్యవస్థ సమస్య లేకపోవడంతో కక్షిదారులకు మేలు జరనుంది.

హై అలర్ట్

కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అంతటా పోలీసులు అప్రమత్తమయ్యారు. భద్రతా చర్యల్లో భాగంగా శనివారం బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన కూడళ్లు, ఆలయాల వద్ద ప్రత్యేక పోలీసు బలగాలు, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లతో తనిఖీలు చేపట్టారు.

లోపలి పేజీలో..



ఏలూరు కొత్తబస్టాండ్‌లోని పార్శిల్ కార్యాలయంలో..

మెరుగైన విద్యుత్ అందిస్తున్నాం

- జిల్లాలో లో-ఓల్టేజి సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు
- రూ. 10.65 కోట్లతో మూడు సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు

- ఏపీఈపీడీసీఎల్ ఏలూరు జిల్లా ఎస్ఈ సాల్మన్‌రాజు



ఇంటర్వ్యూ..

ఏలూరుసిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో మెరుగైన విద్యుత్ సరఫరా అందిస్తున్నాం. మారుమూల ప్రాంతాల్లో అక్కడక్కడా లో-ఓల్టేజి సమస్యలు ఉన్నాయి. వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. లోఓల్టేజి నివారణకు 162 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు కొత్తగా ఏర్పాటు చేశాం. వేసవి దృష్టిలో పెట్టుకుని విద్యుత్ శాఖ మరిన్ని చర్యలు చేపట్టింది. వేసవిలో ఈదురుగాలులు వచ్చిన సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ పునరుద్ధరణ చర్యలను వేగవంతంగా చేపట్టడంతో విద్యుత్ సరఫరా మెరుగ్గా సాగుతోంది. జిల్లాలో ఎక్కడా అధికారికంగా విద్యుత్ కోతలు లేవు' అని ఏలూరు జిల్లా ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ సాల్మన్‌రాజు అన్నారు. ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పలు విషయాలను తెలిపారు.

■ పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజల స్పందన ఎలా ఉంది ?

జవాబు : ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో ఇంటింటికి సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా వినియోగదారులపై విద్యుత్ భారం తగ్గించాలని నిర్ణయించాం. ఈ పథకంపై ప్రజల స్పందన బాగుంది. ఇప్పటికే ఏలూరు జిల్లాలో ఈ పథకం కింద 3,250 దరఖాస్తులు రాగా 1,361కు సంబంధించి సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేశాం. దీనివల్ల 4.75 మెగావాట్ల(4లక్షల మిలియన్ల విద్యుత్) ఉత్పత్తి అవుతోంది. ఇంటికి సరిపడా విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడంతో పాటు మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసి అదనపు ఆదాయాన్ని పొందవచ్చు. ఒక కిలోవాట్ ప్యానల్స్ వల్ల నెలకు 144 యూనిట్లు, రెండు కిలోవాట్‌ల వల్ల 288 యూనిట్లు, మూడు కిలోవాట్ వల్ల 432 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.

■ లో-ఓల్టేజి నివారణకు తీసుకుంటున్న చర్యలేవి ?

జవాబు : జిల్లాలో లో-ఓల్టేజి నివారణకు 162 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను కొత్తగా ఏర్పాటు చేశాం. జంగారెడ్డిగూడెంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించాం. టి.నరసాపురం మండలంలో మర్రిగూడెం, పెదపాడు మండలంలో కొలికి గ్రామాల్లో రూ.7.17 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. జిల్లాలో కొత్తగా రూ.10.65 కోట్లతో 3 సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాం. రూ.4.6 కోట్లతో 5ఎంవీఏ సీటీఆర్‌ల స్థానే 8ఎంవీఏ సీటీఆర్‌లను ఏర్పాటు చేశాం. ఆర్‌డీఎస్ఎస్ పథకంలో రూ.261 కోట్లతో 303 మిశ్రమ ఫీడర్లను వ్యవసాయ, వ్యవసాయేతర ఫీడర్లుగా విభజించే కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

■ జిల్లాలో మొత్తం విద్యుత్ సర్వీసులు ఎన్ని ?

జవాబు : జిల్లాలో మొత్తం 6,03,000 విద్యుత్ సర్వీసులున్నాయి. దీనిలో కేటగిరి- 1 గృహవిద్యుత్ సర్వీసులు 4,58,435 ఉండగా, వాణిజ్య సర్వీసులు 54,782, వ్యవసాయ విద్యుత్ సర్వీసులు 72,472, పరిశ్రమల విద్యుత్ సర్వీసులు 1,438 వరకు ఉన్నాయి.

■ ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ రాయితీలు అందిస్తున్నారా ?

జవాబు : ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ రాయితీలో భాగంగా 2024-25కు సంబంధించి రూ.35.50 కోట్లు రాయితీ ఇస్తున్నాం. దీనిలో ఎస్సీ వినియోగదారులకు రూ.29 కోట్లు, ఎస్టీ వినియోగదారులకు రూ.6.50 కోట్లు రాయితీగా అందించాం.

■ జిల్లాలో ఎన్ని విద్యుత్ ఉపకేంద్రాలు ఉన్నాయి ?

జవాబు : జిల్లాలో 153 విద్యుత్ ఉపకేంద్రాలున్నాయి. వీటిలో 400/200 కేవీ ఉపకేంద్రం ఆదమిల్లిలోను, 200/132 కేవీ ఉపకేంద్రాలు రెండు, 132/11 కేవీ కేంద్రాలు తొమ్మిదితోపాటు మిగిలినవి 33/11 కేవీ ఉపకేంద్రాలున్నాయి.

■ జిల్లాలో సోలార్ గ్రామాలుగా ఎన్ని గుర్తించారు ?

జవాబు : ఏలూరు జిల్లాలో ఐదు గ్రామాలను సోలార్ గ్రామాలుగా గుర్తించాం. ద్వారకాతిరుమల మండలంలో జి.కొత్తపల్లి, పెదవేగి మండలం దుగ్గిరాల, నిడమర్రు మండలం చిననింద్రకొలను, కామవరపుకోట మండలం తడికలపూడి, కొయ్యలగూడెం మండలం యర్రంపేట గ్రామాలను సోలార్ గ్రామాలుగా గుర్తించాం.

■ ద్వారకాతిరుమలలో సోలార్ పార్క్ ఏర్పాటు చేస్తున్నారా ?

జవాబు : ద్వారకాతిరుమలలో 750 కేవీ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసి సోలార్ పార్క్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

■ వ్యవసాయ విద్యుత్ ఫీడర్లకు ఎన్ని ఎకరాలు గుర్తించారు ?

జవాబు : జిల్లాలో ఏడు వ్యవసాయ విద్యుత్ ఫీడర్లకు సంబంధించి 115 ఎకరాలు గుర్తించి 4.5 ఎకరాలకు ఒక మెగావాట్ చొప్పున మొత్తం 25 మెగావాట్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని నిర్ణయించాం.

■ ఆక్వా విద్యుత్ సర్వీసులపై రాయితీ అందిస్తున్నారా ?

జవాబు : జిల్లాలో ఆక్వా విద్యుత్ సర్వీసులకు సంబంధించి యూనిట్‌కు సబ్సిడీపై రూ.1.50కు సరఫరా చేస్తున్న కారణంగా జిల్లాలో 2,982 వినియోగదారులకు రూ.51.91 కోట్ల రాయితీ అందించాం.

సప్త కోటి రామలింగేశ్వర స్వామి

దర్శనానికి వేళాయె..

రేపటి నుంచి నెల రోజులపాటు నత్తారామేశ్వరంలో స్వామి వారి దర్శనాలు



• 11 నెలలపాటు కొలనులోనే శివలింగం

నత్తారామేశ్వరంలో శివాలయం (ఇన్‌సెట్‌లో) పరశురాముడు ప్రతిష్ఠించిన శివలింగం

పవిత్ర గోస్తనీ నది పరివాహక ప్రాంతంలో వెలసిన శైవ క్షేత్రం శ్రీనత్తారామేశ్వరాలయం. సీతారాములు ఈ ప్రాంతాన్ని సందర్శించి నదిలోని నత్తగుల్లలు ఒండ్రు మట్టి మిశ్రమంతో దీర్ఘచతురస్రాకారంలో శివలింగాన్ని చేసి ప్రతిష్ఠించడంతో ఈ గ్రామం నత్తారామేశ్వరంగా ప్రసిద్ధి చెందింది. ఇంతటి పురాణ ప్రాశస్త్యం వున్న ఈ ఆలయ ప్రాంగణంలో 11 నెలలపాటు నీటిలోనే ఉండే సప్త కోటి రామలింగేశ్వర స్వామి సోమవారం నుంచి మే 28వ తేదీ వరకు నెల రోజులపాటు దర్శనమివ్వనున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి కథనం

పెనుమంట్ర, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) :

త్రేతాయుగంలో రాముడిగా, ద్వాపరయుగంలో పరశురాముడి అవతారంలో నత్తారామేశ్వరం ప్రాంతంలో ప్రతిష్ఠించిన శివలింగాలు ఉన్నాయి. పరశురాముడు తల్లిని క్షత్రియలను సంహరించిన దోష పరిహారార్థం ఎక్కడ ఓంకార శబ్దం వినిపిస్తుందో ఆ ప్రాంతంలో శివలింగాన్ని ప్రతిష్ఠించాలని అలాచేస్తే దోష విముక్తి కలుగుతుందని చెప్పడంతో హి మాలయ పర్వతాలలోని క్రౌంచ పర్వతాన్ని ఛేదించి శివలింగాన్ని పట్టుకుని దట్టమైన అటవీ ప్రాంతంలో సంచరించే సమయంలో గోస్తనీ నది గర్భంలో ఋషులు, గురు పుంగవులు తపోదీక్ష చేస్తూ ఓంకార నాదం వినిపించడంతో ఆ ప్రాంతంలో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. ఈ ప్రతిష్ఠాపనకు ఏడు కోట్ల మంది బ్రహ్మాది దేవతలు హాజరుకావడంతో ఈ శివలింగానికి సప్త కోటి శివలింగంగా, పరశురాముడు ప్రతిష్ఠించుట చేత సప్త కోటి రామలింగేశ్వర స్వామిగా పిలుస్తారు. ఉగ్ర రూపుడైనా పరశురాముడు ప్రతిష్ఠ చేయడంతో ఈ ప్రాంతమంతా అగ్ని కీలక మంటలు వ్యాపించడంతో బ్రహ్మాది దేవతలు ఆదేశాలసారం పదకొండు నెలలు నీటిలో ఉంచి ఒక్క వైశాఖ మాసంలోనే భక్తులకు దర్శన మివ్వడమనే ఆజ్ఞను నేటికీ అమలు జరుగుతుంది. ఒక్క వైశాఖమాసంలోనే నెలరోజుల పాటు భక్తులకు స్వామి వారి దర్శనమిస్తారు. ఈ క్షేత్రంలో లక్ష్మణుడు ప్రతిష్ఠించిన మరొక శివలింగం ఉండడంతో ఈక్షేత్రానికి త్రిలింగ క్షేత్రంగా పేరుగాంచింది. ఏకకాలంలో మూడు శివలింగాలు దర్శించుకుని పూజలు నిర్వహిస్తే కోటి జన్మల పుణ్యం లభిస్తుందని భక్తుల విశ్వాసం.



నత్త గుల్లలు, మట్టితో తయారు చేసిన శివలింగం



రాముడు, సీతాదేవి లింగం చేయగా మిగిలిన ఆనాటి నత్తలతో కూడిన మట్టి ముద్ద

వైశాఖ మాసంలో పర్వదినాలు

వైశాఖ మాసం ఈనెల 28 నుంచి ప్రారంభం కానుండడంతో పదకొండు నెలలపాటు నీటిలోనే ఉన్న శివలింగం దర్శనం ప్రారంభించి మే 28న వైశాఖమాసం దర్శనాలు ముగుస్తాయని ఈవో యాళ్ల సూర్యనారాయణ తెలిపారు. 28న, మే5న వైశాఖ సోమవారం పర్వదినం. మే12న వైశాఖ మాస పౌర్ణమి పర్వదినం, 19న వైశాఖ సోమవారం, 22న హనుమాన్ జయంతి, 25న మాస శివరాత్రి, 26న వైశాఖ సోమవారం. 27న వైశాఖ మాసం స్వామికి మహానివేదనతో నీటితో నింపేస్తారని ఈవో తెలిపారు. పర్వదినాల్లో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు దాతల సహకారంతో అన్నసమారాధన నిర్వహిస్తున్నామని, పులిహోర, మజ్జిగ, బెల్లం పానకం, చక్కెర పొంగలి భక్తులకు ప్రసాదంగా దాతలు వితరణ చేస్తున్నారని తెలిపారు.

జీవిత విశేషాలు చాటిన నాటికలు

- భీమవరంలో మూడో రోజు 18వ జాతీయస్థాయి నాటకోత్సవాలు





'ఉక్కు సంకెళ్లు' నాటికలో సన్నివేశం.. జ్యోతి ప్రజ్వలన చేసిన చైతన్య భారతి నాటక పరిషత్ సభ్యులు

భీమవరం అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చైతన్య భారతి సంగీత నృత్య నాటక పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న నాటికలు జీవిత విశేషాలు చాటాయి. భీమవరం డీఎన్ఆర్ కళాశాల గన్నాబత్తుల వారి క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న 18వ జాతీయస్థాయి సాంఘిక నాటికోత్సవాల్లో మూడోరోజు శనివారం రాత్రి మూడు నాటికలు ప్రదర్శించారు. తొలుత నాటిక పోటీల జ్యోతిప్రజ్వలనను సాగి విరల్ రంగరాజు, వేగేశ్న రామకృష్ణంరాజు, కొత్త శ్రీరామనారాయణ చేసి ప్రారంభించారు. నాటిక పోటీలకు న్యాయ నిర్ణేతలుగా నుసుము నాగభూషణం, లండ రుద్రమూర్తి, మానాపురం సత్యనారాయణ వ్యవహించారు. నాటక పరిషత్ అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్, కార్యదర్శి మంతెన రామ్‌కుమార్‌రాజు, రాయప్రోలు శ్రీనివాసమూర్తి, భట్టిప్రోలు శ్రీనివాస్, పేరిచర్ల లక్ష్మణవర్మ, బొండా రాంబాబు, పెన్నాడ శ్రీను తదితరులు నాటిక పోటీలను పర్యవేక్షించారు. భీమవరం ఒకటో అదనపు సివిల్ జడ్జి టి.అనీషా నాటికలను తిలకించారు.

ఉక్కు సంకెళ్లు నాటిక..

కోల్‌కత కేంద్రంగా 1,840లో ఈస్టిండియా కంపెనీ వారు భారతదేశాన్ని పరిపాలిస్తున్నారు. ఆ కాలంలో రాణీరాస్మదేవి అనే జమిందారిణి పేదలపక్షాన నిలిచి స్త్రీశక్తిగా పేరుగడించింది. ఆమె ఆనాడు జాలరైన పేదప్రజల కోసం చేసిన పనులను ఆ రోజుల్లో జీవన విధానం దొరల పాలన కళ్లకు కట్టినట్టు మహతి క్రియేషన్స్, హైదరాబాద్ వారి ఉక్కు సంకెళ్ల నాటిక ద్వారా ప్రేక్షకులకు చూపించారు. రచన సింహప్రసాద్, దర్శకత్వం సుబ్బరాయ శర్మ ఉప్పులూరి, రాణీరాస్మదేవి పాత్రలో శ్రీజ సాధినేని, పిలిప్స్ దొర వేషధారణలో నిట్టల శరత్ కుమార్ తమ నటనతో నాటికను మరింత రసరమ్యంగా అలరించారు. పాతరోజుల సెట్టింగ్ అందరిని ఆకట్టుకున్నాయి.

(అ)సత్యం నాటిక..

దైవత్వమైనా, రాక్షసత్వమైనా, స్వార్థమైనా, పరమార్థం అయినా అది మనిషి హృదయంలో ఉంటుంది. ప్రతిసత్యం వెనుక, ప్రతి అసత్యం వెనుక మనిషి స్వార్థమో, భయమో చుట్టుకుని ఉంటుంది అదే అతనికి మేలు చేస్తుంది అని తెలిపిన నాటిక కళాస్రవంతి ఉక్కునగరం వారి '(అ)సత్యం' నాటిక, మూలకథ సుధా మోదుగు, నాటకీరణ పిన్నమనేని మృత్యుంజయరావు, దర్శకత్వం పి.బాలాజీనాయక్ వహించారు. పాత్రదారులుగా పి.బాలాజీనాయక్, పి.రామారావు, అనిల్ కుమార్, ఎం.వాసు, ఎస్.మాధవి నాటికను రక్తి కట్టించారు.

'ఇది రహదారి కాదు' నాటిక

మన దేశంలో కావాల్సినంత స్వేచ్ఛ ఉంది. దీని ఆధారంగా చేసుకుని పరాయి దేశాల సంస్కృతితో యువత 'లివింగ్ టుగెదర్' పెళ్లి చేసుకోకుండా ఆడామగా కలిసి ఉండడం అనే సంస్కృతి. అలాగే 'డింక్ సంస్కృతి' అంటే 'డ్యూయల్ ఇన్‌కం నో కిడ్స్' ఇద్దరూ సంపాదిస్తారు కానీ పిల్లల్ని కనరట ఇటువంటి సంస్కృతులు మన దేశంలో చాప కింద నీరులా ప్రవేశించి యువతను పాడుచేస్తున్నాయి అని తెలిపే వాటినుంచి యువ జంటలను కాపాడాలి అనే విధంగా సాగిన నాటిక మిత్రా క్రియేషన్స్ హైదరాబాద్ వారి ఇది రహదారి కాదు, మూల కథ భాస్కర, దర్శకత్వం ఎస్ఎం బాషా. నటీనటులుగా బి.నాగరాణి, దేవేష్, జగదీష్, మంజునాథ్, టీ సుజిత్‌లు తమ నటనతో ఆహుతుల్ని అలరించారు.

త్వరలో హార్బర్, నల్లీక్రీక్ పనులు

- ఆర్థిక శాఖ క్లియరెన్స్ రాగానే పెండింగ్ డెల్టా మోడరైజేషన్ పనులు
- మత్స్యకారులకు భరోసా చెక్కుల పంపిణీలో మంత్రి డాక్టర్ నిమ్మల

నరసాపురంటౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా పెండింగ్ పడుతూ వస్తున్న బియ్యపుతిప్ప హార్బర్, నల్లీక్రీక్ పనులు త్వరలో తిరిగి ప్రారంభిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చారు. శనివారం రాత్రి పట్టణంలోని జనసేన కార్యాలయం వద్ద నిర్వహించిన మత్స్యకార భరోసా చెక్కులు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి 1,802 మందికి చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు వల్ల నరసాపురం నియోజకవర్గం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. 2019లో శంకుస్థాపన చేసిన హార్బర్, నల్లీక్రీక్ పనులను వైసీపీ ప్రభుత్వం కుంటిసాకులతో నిలుపుదల చేసిందన్నారు. తాను ఇప్పుడే మంత్రి అచ్చెన్నాయుడుతో హార్బర్ నిమిత్తం ఫోన్‌లో మాట్లాడితే త్వరలో పనులు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. తొలుత నల్లీక్రీక్ విషయాన్ని కూడా గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌తో చర్చించామన్నారు. ఆయన పాత ధరలకే పనులు చేపట్టేందుకు సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. 2007లో చేపట్టిన డెల్టా మోడరైజేషన్ పనులు గోదావరి జిల్లాల్లో అసంపూర్తిగా జరిగాయన్నారు. ఆ తరువాత టీడీపీ ప్రభుత్వం కొన్ని పనులను తిరిగి ప్రారంభించినప్పటికీ గత జగన్ పాలన నీటి పారుదలశాఖను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. ఆర్థిక శాఖ క్లియరెన్స్ రాగానే పెండింగ్ పడిన డెల్టా మోడరైజేషన్ పనులను తిరిగి ప్రారంభిస్తామన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో పంట కాలువలను, ఇరిగేషన్ వ్యవస్థను పూర్తిగా మెరుగుపర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అధ్యక్షత వహించిన ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ మత్స్యకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తామన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ నరసాపురం నియోజకవర్గం పూర్తిగా అభివృద్ధికి దూరంగా నిలిచిందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో పెండింగ్ పనులు పూర్తిచేయాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అభివద్ధి కంటే కక్ష సాధింపులే ఎక్కువ జరిగాయన్నారు. ఇన్‌చార్జి రామరాజు, కొవ్వలి నాయుడు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకార సంఘ అధ్యక్షుడు మైలా వసంతరావు, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, ఆర్డీవో దాసి రాజు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన హేమ వర్షిని

జాతీయస్థాయి స్పెషల్ ఒలింపిక్స్ పోటీలకు హేమవర్షిని

తాడేపల్లిగూడెం రూరల్ ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం భవితా కేంద్రానికి చెందిన ఒమ్మి హేమవర్షిని జాతీయస్థాయి స్పెషల్ ఒలింపిక్స్ పోటీలకు ఎంపికైనట్టు భవితా కేంద్ర ఉపాధ్యాయుడు ఎస్కే బాల ఈశ్వరయ్య తెలిపారు. ఇటీవల ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు తల్లిదండ్రులు రాము, మహాలక్ష్మి తెలిపారు. తమ పాప దివ్యాంగురాలని చిన్నచూపు చూడకుండా మిగిలిన పిల్లల మాదిరిగా ప్రోత్సహించడం వల్ల ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడంతోపాటు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. పాపకు తర్ఫీదునిచ్చిన బాల ఈశ్వరయ్యకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



గిన్నిస్ బుక్ ప్రతినిధి నుంచి మెడల్ అందుకుంటున్న వితేశ్

'వితేశ్‌బాబు' గిన్నిస్ బుక్ రికార్డు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు తంగెళ్ళమూడి, బీడీ కాలనీకి చెందిన జల్లి వితేశ్‌బాబు కీబోర్డు మీటడంలో గిన్నిస్‌బుక్ రికార్డు సాధించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. హైదరాబాద్‌లోని అంతర్జాతీయ హలెల్ మ్యూజిక్ స్కూల్ కీబోర్డు విభాగంలో ఎంట్రీలను ఆహ్వానించగా, వితేశ్‌బాబు పేరు నమోదు చేయించుకున్నారు. 2024 డిసెంబరు ఒకటిన గంట పాటు ఆన్‌లైన్‌లో 1,046 మందితో ఆపకుండా కీబోర్డుప్లే కార్యక్రమం నిర్వహించగా అది గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించింది. అందులో భాగస్వామి అయిన వితేశ్‌కు గిన్నిస్‌బుక్ రికార్డు ప్రతినిధులు మెడల్, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా 28వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల అరుణ సురేష్, తదితరులు వితేశ్‌బాబుకు అభినందనలు తెలిపారు.





దాతలు వెంకట్రాజు, రామారావుకు బాండులు అందజేస్తున్న ఏఈవో నటరాజారావు

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.6 లక్షల విరాళం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు దాతలు వేర్వేరుగా రూ.6 లక్షలు విరాళం శనివారం అందజేశారు. తణుకు పట్టణానికి చెందిన దాత వీరమల్లు వెంకట్రాజు ప్రతీరోజూ తమ పేర అన్నదానం జరపాలని కోరుతూ రూ.5లక్షలను విరాళంగా అందించారు. పశ్చిమగోదావరి జిల్లా కాజ పడమరకు చెందిన గుబ్బల రామారావు కుటుంబం లక్ష రూపాయలు మొత్తం రూ.6 లక్షలు అన్నదాన ట్రస్టుకు జమ అయ్యాయి. దాతలను ఆలయ ఏఈవో పి.నటరాజారావు విరాళం బాండు పత్రాలను అందించి సత్కరించారు.





మందేశ్వరస్వామికి తైలాభిషేకం చేస్తున్న అర్చకుడు, ఆలయంలో భక్తుల పూజలు

మందేశ్వరునికి తైలాభిషేకాలు

పెంటపాడు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : వల్లూరుపల్లి మందేశ్వరస్వామి ఆలయంలో శనివారం శనిత్రయోదశి పూజలు వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి తమ శనిదోష నివారణల కోసం ప్రత్యేక పూజలు చేసి స్వామికి తైలాభిషేకాలు చేయించుకున్నారు. అర్చకులు పూజ్యం గంగాధరశర్మ, పూజ్యం సత్యనారాయణశర్మ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రధాన కార్యక్రమాలకు ఈవో గైర్హాజరు..

ఆలయంలో శని త్రయోదశి పూజలకు గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. వీటి ఏర్పాట్లను పర్యవేక్షించాల్సిన ఈవో చీమలకొండ సాయితోపాటు కొందరు సిబ్బంది గైర్హాజరు కావడంతో సరైన ఏర్పాట్లు లేక భక్తులు అసహనం వ్యక్తం చేశారు. పెంటపాడు బాల వేంకటేశ్వర స్వామి ఆలయానికి సాయినే ఈవోగా పనిచేస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో జరిగిన ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామి వారి ఉత్తర ద్వార దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అప్పుడు సదరు ఈవో రాలేదు. అప్పుడు పల్లకి కర్ర విరిగిపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఈవో తీరుపై ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఉన్నతాధికారులు దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

శ్రీవారి క్షేత్రంలో భక్తులు కళకళ

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి సన్నిధి శనివారం భక్తజనులతో కిటకిటలాడింది. సాధారణంగా అమావాస్య ముందురోజు భక్తులు తక్కువగా ఆలయానికి వస్తారు. టెన్త్ పరీక్ష ఫలితాలు రావడంతోపాటు స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో ఉదయం నుంచే ఆలయానికి భక్తుల రాక ప్రారంభమైంది. వేలాదిమంది భక్తులు క్షేత్రానికి చేరుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. దాదాపు 20వేల మంది భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. స్వామి వారి దర్శనానంతరం ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ముగిసిన శ్రీనివాసుని కల్యాణోత్సవాలు

చినవెంకన్న క్షేత్రానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురం ఆలయంలో జరుగుతున్న శ్రీనివాసుని కల్యాణోత్సవాలు శనివారం రాత్రి జరిగిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం స్వామి, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. యాగశాలలో హోమాదిక్రతువులను జరిపారు. సాయంత్రం ద్వాదశకోవెల ప్రదక్షిణలను, రాత్రి శ్రీపుష్పయాగోత్సవాన్ని అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థులు నిర్వహించారు.



పాలకోడేరులో ఇళ్లు కోల్పోయిన బాధితులతో మాట్లాడుతున్న మాధవరావు, తదితరులు

పేదలపై అధికారుల తీరు దుర్మార్గం

- ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవరావు

పాలకోడేరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : పేదల ఇళ్ల తొలగింపులో అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పేవన్నీ అవాస్తవాలేనని, పేద ప్రజలపై అధికారుల తీరు దుర్మార్గమని, బాధితులందరికీ అండగా నిలుస్తామని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.మాధవరావు భరోసానిచ్చారు. శనివారం పాలకోడేరు ఏఎస్ఆర్ నగర్‌లో ఇటీవల ఇళ్ల తొలగింపు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించగా మీడియాల్లో వచ్చిన వార్తల ఆధారంగా ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైకోర్టు లాయర్ల బృందం శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో సుమారు 700 ఇళ్లపైనే కూల్చారని తెలిసింది. దీనిలో భాగంగా పాలకోడేరు వైఎస్ఆర్ నగర్‌లో అక్రమంగా ఇళ్లు తొలగించిన ప్రాంతాన్ని పరిశీలించాలని వచ్చామన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న కాలువలకు మురుగునీరు వెళుతుందని అధికారులు, ప్రభుత్వం చెబుతున్నదంతా అవాస్తవమన్నారు. ఇదే ప్రాంతానికి 20 ఏళ్ల క్రితం టీడీపీ ఎమ్మెల్యే సీసీ రోడ్డు ఏర్పాటు చేశారన్నారు. ఆ రోడ్డును దాటే మురుగునీరు కాలువలోకి రావాలని, కానీ ఆ నీరు రాకుండా ప్రతి ఇంటికి సెప్టిక్ ట్యాంక్ ఉందని తెలిపారు. నిజంగా మురుగునీరు కలుషితమైతే ఆ నీటిని పరీక్ష కోసం ల్యాబ్‌లకు పంపాలని సూచించారు. బాధితుల ఇళ్లకు వెనుక భాగాన ఉన్న భూస్వాములు ఎకరాల కొద్ది ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే అవి అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. పునరావాసం కల్పించకుండా హుటాహుటిన ఇళ్లను కూల్చేయడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులందరూ ఐక్యంగా పోరాడితే చట్టపరంగా అవసరమైన న్యాయ సహాయాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు, అడ్వకేట్ దిగుపాటి రాజగోపాల్, హైకోర్టు అడ్వకేట్ యడవల్లి రమేష్, హైకోర్టు లాయర్స్ సంపర శ్రీనివాసరావు, మాదాల సాయితేజ, ఎన్.కోటబాబు, పీవీపీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల నుంచి దేవస్థానం భూమికి విముక్తి

నరసాపురం రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : చిట్టవరం గ్రామంలో ఆక్రమణలకు గురైన మదనగోపాల స్వామి ఆలయ భూమిని శనివారం దేవస్థానం అధికారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ భూమి చుట్టూ రెవెన్యూ, పోలీసుల సమక్షంలో ప్రహరీ నిర్మించారు. గ్రామంలో దేవస్థానానికి సంబంధించి మూడున్నర సెంట్లు భూమి అక్రమణకు గురైంది. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా స్థలాన్ని స్వాధీనం చేసుకుని దేవస్థానానికి అప్పగించారు. ఆనంతరం జిల్లా ఎండోమెంట్ అధికారి హరి సూర్యప్రకాశ్ విలేకర్లతో మాట్లాడుతూ మారిన చట్టం ప్రకారం దేవస్థానం భూముల్ని అక్రమించడం, కబ్జా చేయడం కుదరదన్నారు. ఇలా అన్యాక్రాంతమైన స్థలాలన్ని గుర్తించి వాటిని తిరిగి స్వాధీనపర్చుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం రూరల్ ఎస్సై ఎండోమెంట్ అధికారి వెంకటేశ్వరరావు, వీఆర్వో శ్రీనివాస్, కార్యదర్శి పుల్లాజీలు ఉన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా కె.ఆర్.పురం ఐటీడీఏ పరిధిలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరం ఇంటర్‌లో చేరేందుకు టెన్త్ ఉత్తీర్ణత సాధించిన గిరిజన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ తెలిపారు. ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి గురుకుల బాలికల కళాశాలలో ప్రథమ సంవత్సరానికి గానూ ఎంపీసీ 45, బైపీసీ 45, హెచ్ఈసీ 45, ఏ&టీ 20 సీట్లు ఉన్నాయన్నారు. కె.ఆర్.పురం గురుకుల బాలుర కళాశాలలో ఎంపీసీ 40, బైపీసీ 40, సీఈసీ 40, హెచ్ఈసీ 40, ఏ&టీ 20 సీట్లు ఉన్నాయని, జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు గురుకుల బాలుర కళాశాలలో ఎంపీసీ 40, బైపీసీ 40, సీఈసీ 40, హెచ్ఈసీ 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఈనెల 24 నుంచి మే 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, టెన్త్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను తీసుకుని దగ్గరలోని గురుకులానికి వెళ్లి దరఖాస్తు చేయవచ్చన్నారు. మరిన్ని వివరాలకు (94909 57254, 9490957252, 9490957250) నెంబర్లలో సంప్రదించాలని పీవో తెలిపారు.

నేడు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

నరసాపురం రూరల్ : గురుకుల పాఠశాలలో ఐదు నుంచి 9వ తరగతి వరకు ఆంగ్ల మీడియంలో చేరదల్చిన విద్యార్థులకు ఈ నెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు నరసాపురం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, పరీక్షల కన్వీనర్ శైలజ తెలిపారు. తాడేపల్లిగూడెంలోని కడకట్ల(బాలుర), నరసాపురంలోని నక్కావారిపాలెంలోని గురుకుల పాఠశాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షా కేంద్రానికి రావాలని తెలిపారు.

ముగిసిన టీచర్ల మెడికల్ చెకప్ క్యాంపు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ,స్పెషల్ పాయింట్లు పొందేందుకు అవసరమైన వైద్య ధ్రువీకరణ పత్రాల జారీకి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని హెచ్ఎంలు, టీచర్లకు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నిర్వహించిన మెడికల్ చెకప్ క్యాంపు శనివారం ముగిసింది. చివరి రోజున 11మంది టీచర్లు హాజరయ్యారు. మూడ్రోజుల్లో మొత్తం 431మంది తమ పాత వైద్య ధ్రువీకరణ పత్రాలను తీసుకురాగా, ముగ్గురు వైద్య నిపుణుల బృందంతో కూడిన మెడికల్ బోర్డు వారిని, సర్టిఫికెట్లను భౌతికంగా పరిశీలించింది. కొత్త మెడికల్ సర్టిఫికెట్లను మూడ్రోజుల వ్యవధిలో డీఈవో కార్యాలయం నుంచి సంబంధిత మండలాల ఎంఈవోలకు అందజేస్తామని, వారినుంచి టీచర్లు ధ్రువీకరణ పత్రాలను తీసుకోవాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ సూచించారు.

హై అలర్ట్

- కశ్మీర్ ఉగ్రదాడి నేపథ్యంలో ముందస్తు భద్రతా చర్యలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రద్దీ ప్రాంతాలు, హోటళ్లు, లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు
- అప్రమత్తంగా ఉండాలంటూ పోలీస్ శాఖకు ఆదేశాలు
- డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లతో క్షుణ్ణంగా తనిఖీలు



భీమవరం బస్టాండ్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు



ఏలూరు కొత్తబస్టాండ్‌లో పోలీసుల తనిఖీలు

ఏలూరు క్రైం/భీమవరం క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్రం నుంచి వచ్చి హై అలర్ట్‌తో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా పలు పట్టణాల్లో తనిఖీలు చేపట్టారు.దేశంలోని ప్రధాన నగరాలు ముఖ్యమైన పర్యాటక కేంద్రాల్లో, జన సంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ప్రత్యేక తనిఖీలను చేపట్టారు. ఇప్పటికే జిల్లాలో పాకిస్థానీయులు ఉంటే ఈ నెల 27వ తేదీలోపు తమ దేశానికి వెళ్ళిపోవాలని ఏలూరు జిల్లా ఎస్పీ కె.పి.ఎస్.కిశోర్, పశ్చిమ గోదావరి జిల్లా అద్నాన్ నయీం అస్మిలు హెచ్చరించారు. తదుపరి ఎవరైనా ఉంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉంటే శనివారం తెల్లవారు జాము నుంచే ప్రత్యేక పోలీస్ బలగాలు, డాగ్ స్క్వాడ్,క్లూస్ టీమ్‌లతో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అలాఏ ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఇంకోవైపు శనివారం సాయంత్రం 4నుంచి 6గంటల వరకూ జిల్లా వ్యాప్తంగా నాకాబందీ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన కూడళ్లు, వాహనాలను కూడా తనిఖీలు చేశారు. ఏలూరు నగరంలో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో పోలీసు జాగిలాలతో క్షుణ్ణంగా తనిఖీలు చేయించారు. ఏలూరు కొత్త బస్టాండ్‌లోని పార్శిల్ కార్యాలయంలోని పార్శిళ్లను పోలీస్ జాగిలాలతో పరిశీలన చేయించారు. అలాగే భీమవరం పట్టణంలోని హోటళ్ళు, లాడ్జీలలో బస చేస్తున్న వ్యక్తుల తనిఖీలు, వారి వివరాలు సేకరణ, ధృవపత్రాల పరిశీలించి ఆయా హోటళ్ల నిర్వాహకులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో జన సంచారం ఎక్కువగా ఉండే మార్కెట్లు, షా పింగ్ మాల్స్, సినిమా థియేటర్లు, బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడమే లక్ష్యంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొత్తం మీద ఎలాంటి విపత్తు ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కోవడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం సంసిద్ధంగా ఉన్నట్లు పోలీసులు స్పష్టం చేశారు. విస్తృత తనిఖీలకు జిల్లా ప్రజలు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనిస్తే తక్షణమే పోలీసు అధికారులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేశారు.

పాకిస్థాన్ పౌరులకు జారీ చేసిన వీసాలు రద్దు..

ఏలూరు : పాకిస్తానీ పౌరులకు భారత ప్రభుత్వం జారీ చేసిన అన్ని చెల్లుబాటు అయ్యే వీసాలు ఏప్రిల్ 25వ తేదీ నుంచి రద్దుకానున్నాయని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలెక్టర్లు, ఎస్పీలకు సంబంధిత సమాచారం పంపారన్నారు. ఈ నేపథ్యంలో మెడికల్ వీసాలు, దౌత్య, అధికారిక వీసాలు మినహా అన్ని చెల్లుబాటయ్యే వీసాలు ఏప్రిల్ 27వ తేదీ నుంచి రద్దు కానున్నాయన్నారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వం పాకిస్తానీ పౌరులకు వీసా సేవలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించినట్టు తెలిపారు. పాకిస్తానీ పౌరులకు జారీ చేసిన మెడికల్ వీసా ఏప్రిల్ 29 వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయన్నారు. పాకిస్థానీ పౌరులకు జారీ చేయబడిన దీర్ఘకాలిక వీసాలు, దౌత్య, అధికారిక వీసాలకు వర్తించదని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్టు తెలిపారు.

పాక్ దేశస్థులుంటే.. దేశం విడిచి వెళ్లండి

- ఏలూరు ఎస్పీ కేపీఎస్ కిశోర్

ఏలూరు క్రైం : ఏలూరు జిల్లా పరిధిలో పాకిస్థాన్ దేశానికి చెందిన పౌరులు ఉంటే తప్పనిసరిగా ఈ నెల 27వ తేదీ లోపు భారత దేశాన్ని విడిచిపెట్టి వెళ్లాలని ఎస్పీ కిశోర్ ప్రకటించారు. రాష్ట్ర డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు రాష్ట్రంలో పాకిస్థానీలు ఎవరు ఉండకూడదన్నారు. దీనిలో భాగంగా జిల్లా పరిధిలో ఎవరైనా పాకిస్థానీయులు ఉంటే వెంటనే వెళ్లిపోవాలని ఈ నిబంధనలు పాటించని వ్యక్తులపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. అటువంటి వ్యక్తులు సంబంధిత పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇచ్చి దేశం విడిచి వెళ్లాలని సూచించారు. లేకుంటే వీసా నియమావళి ఉల్లంఘన, ఇతర చట్ట ఉల్లంఘనల కింద కఠిన న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతలను కాపాడేందుకు ప్రతి ఒక్కరు పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపండి : సీపీఎం



కొల్లేరు చిత్రపటం పరిశీలిస్తున్న నాయకులు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కొల్లేరును 5 నుంచి మూడో కాంటూరుకు కుదించి.. ఉపాధి, అభివృద్ధి పనులు చేపట్టి ప్రభుత్వం అక్కడి ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. కొల్లేరు గ్రామాల్లో శనివారం సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకుల బృందం పర్యటించి మాధవపురం పక్షుల కేంద్రం, పెద ఎడ్లగాడి వద్ద కొల్లేరు ప్రాంతాన్ని పరిశీలించింది. గుడివాకలంక, కలకుర్రు గ్రామాల్లో జరిగిన సభల్లో అక్కడి గ్రామస్తులు తాతపూడి చందు, దొరబాబు, కొల్లేరు నాయకులు, ఇతర పెద్దలు మాట్లాడుతూ 2006 నుంచి వారు పడుతున్న కష్టాలను వివరించారు. ఉపాధి లేక ఇక్కడి ప్రజలు వలసపోతున్నారని, కొల్లేరు ప్రాంతమన్న పేరుతో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిపివేశామన్నారు. ఐదో కాంటూరులో లేని గ్రామాలను, జిరాయితీ భూములను సైతం ధ్వంసం చేశారని తెలిపారు. కొవ్వాడ లంక గ్రామాల్లో ప్రజలకు సెంటు భూమి కూడా లేకుండా పోయిందన్నారు. ఆయా సభల్లోనూ, పేద ఎడ్ల గాడి వంతెనపై మీడియాతోనూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ భవిష్యత్ ఏమిటన్న భయం కొల్లేరు ప్రజల్లో కనబడుతోందన్నారు. ప్రభుత్వం సుప్రీం కోర్టులో అఫడవిట్ వేసి వాస్తవ పరిస్థితులను కోర్టుకు వివరించాలని శ్రీనివాసరావు ముందుగా అఖిల పక్షం సమావేశం ఏర్పాటు చేసి ఇక్కడి ప్రజలకు అభయమి చ్చి కలిసి కట్టుగా ముందుకు సాగేలా చూడాలని ప్రభుత్వానికి సూచించారు. కొల్లేరు కాంటూరు లెక్కలన్ని కాకి లెక్కలుగా ఉన్నాయని, శాస్త్రీయత లేకుండా నిర్ధారించారన్నారు.ఈ కా ర్యక్రమలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర సీనియర్ నాయకులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి పాల్గొన్నారు.

స్త్రీనిధి సొమ్ము గోల్‌మాల్

- డ్వాక్రా మహిళలకు రూ.36 లక్షలకు కుచ్చుటోపి
- టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుకు బాధితుల మొర



మహిళల గోడు వింటున్న గన్ని

గణపవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : గణపవరం మండలం ముగ్గళ్ల గ్రామానికి చెందిన సహాయ సంఘాలకు చెందిన స్త్రీనిధి సొమ్ము గోల్ మాల్ అయిన ఘటన ఈ ప్రాంతంలో తీవ్ర సంచ లనం సృష్టించింది. గణపవరం ఏపీఎం ఎస్.ఎస్.అమీ ఉన్నీషను వివ రణ కోరగా స్త్రీ నిధి సొమ్ము రూ.16 లక్షలను వీవోఏ వెంకటలక్ష్మి వాడుకున్నట్టు ప్రాథమికంగా తెలిసిందన్నారు. ఈ నెల 15వ తేదీ లోపు చెల్లిస్తానని హామీ ఇచ్చి జమ చేయకుండా పరారైందని అమీ ఉన్నీష తెలిపారు. వీఓఏ వెంకటలక్ష్మిపై గణపవరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ ఘటనపై మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులును బాధిత మహిళ లు ఆశ్రయించారు. ఈ ఘటనపై విచారణ జరిపి డ్వాక్రా సంఘాల మహిళలకు న్యాయం చేయాలని కోరారు. పరారైన వీవోఏపై చర్యలు తీసుకుని తమ సొమ్ములు రికవరీ చేయించేలా సహకరించాలని మొరపెట్టుకున్నారు. దీనిపై గన్ని వీరాంజనేయులు ఉన్నతాధి కారుల తో ఫోన్‌లో మాట్లాడి రికవరీ చేయాలని కోరారు. అయితే ప్రాథమిక విచారణలో 16 లక్షలని తేలగా, మొత్తంగా 36 లక్షలు కాజేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. అధికారుల విచారణలో వివరాలు తేలనున్నాయి.

ఎవరి దారి వారిదే

- ఇన్‌చార్జ్‌ల పాలనలో ఆలయాలు - ఈవోలున్నా పాలన వారిదే..
- పెంటపాడులో ఆ ఈవో చేతిలోనే అధికారాలు - వెల్లువెత్తుతున్న విమర్శలు

(పెంటపాడు-ఆంధ్రజ్యోతి)

దేవదాయ శాఖలో ఎవరికి వారే యమునా తీరే అన్న రీతిలో సిబ్బంది వ్యవహరిస్తున్నారు. ఆలయాలకు ఈవోలను నియమించినా ఇన్‌ఛార్జ్‌ల హవా కొనసాగుతోంది. భూములు పుష్కలంగా ఉన్నా ఆలయాలకు ఈవోలను నియమించడం లేదు. అందుకు పెంటపాడులోని ఆలయంలో ప్రత్యక్ష నిదర్శనం. పెంటపాడు బాలవెంకటేశ్వర స్వామి ఆలయానికి ఇన్‌చార్జ్ ఈవో ఉన్నారు. అక్కడ కొన్నాళ్లపాటు అర్చకుడు కూడా లేరు. ఇటీవల అర్చకున్ని నియమించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించడంలో ఆర్చకునిదే అన్ని బాధ్యతలు. దాంతో అర్చకునికి తొలుత రూ. 15వేలు వేతనం ఇచ్చారు. కొద్ది రోజుల వ్యవధిలోనే రూ. 20వేలు ఇస్తామంటూ నమ్మబలికారు. ఇప్పటి వరకు ఇవ్వడం లేదు. ఈ ఆలయానికి 48 ఎకరాల భూమి ఉంది. అయినా ఆలయం శిథిలావస్థలో ఉంటుంది. అర్చకులు ఆకలితో అలమటించాల్సిందే. రెగ్యులర్ ఈవోను నియమించడంలో దేవాదాయ శాఖ విఫలమైంది. గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చొరవ తీసుకుని ప్రధానార్చకుణ్ణి నియమించేలా చర్యలు తీసుకున్నారు. ఆ అర్చకునికి రూ. 20వేలు వేతనం ఇవ్వడంలేదని, పైగా రెగ్యులర్ చేయడం లేదంటూ గ్రామస్థులు ఫిర్యాదు చేస్తున్నారు. జిల్లా అసిస్టెంట్ కమిషనర్ దృష్టికి కూడా సమస్య తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. సిబ్బంది మాత్రం ఉన్నారు. ఆదాయమంతా సిబ్బంది వేతనాలకు సరిపెడుతున్నారు. అంతే తప్పా దేవునికి నిత్య కైంకర్యాలు నిర్వహించే అర్చకునికి మాత్రం సక్రమంగా వేతనం ఇవ్వడం లేదు. అంతే కాదు. పెంటపాడులోని వల్లూరుపల్లి, బోడపాడు దేవాలయాలకు అబ్బులు అనే ఈవోను నియమించారు. ఆయనకు బాధ్యతలు అప్పగించడం లేదు. ఆ రెండు దేవాలయాలకు సాయి అనే ఈవో ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. రెండు దేవాలయాలకు అబ్బులు అనే ఉద్యోగికి బాధ్యతలు అప్పగించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి ఆ దిశగా కృషి చేశారు. అయినా ఇన్‌ఛార్జ్ పాలనే సాగుతోంది. ఇన్‌ఛార్జ్ ఈవో బాధ్యతలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. దీనిపై జిల్లా అధికారులు సైతం చర్యలు తీసుకోలేకపోతున్నారు.

ఏవోలకు ఎంపీడీవోలుగా పదోన్నతులు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఐదుగురు..

ఏలూరు సిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వివిధ మండల పరిషత్‌లలో ఏవోలు (పరిపాలనాధికారులు)గా పనిచేస్తున్న ఐదుగురికి మండల పరిషత్ అభివృద్ధి అధికారులుగా పదోన్నతులు లభించాయి. వివరాలు ఇలా ఉన్నాయి.

పేరు	హోదా- పనిచేస్తున్న కార్యాలయం	పదోన్నతి పోస్టు- కేటాయించిన జిల్లా
వై.సుజాత	ఏవో, మండల ప్రజాపరిషత్, ఏలూరు	ఎంపీడీవో, ఏలూరు జిల్లా
జి.నాగరాజ కుమారి	ఏవో, మండల ప్రజాపరిషత్, భీమడోలు	ఎంపీడీవో, ఏలూరు జిల్లా
ఎంఎస్ ప్రభాకరరావు	ఏవో, మండల ప్రజాపరిషత్, కాళ్ళ	ఎంపీడీవో, పశ్చిమగోదావరి జిల్లా
జి.రాజ్‌మనోహర్	ఏవో, మండల ప్రజాపరిషత్, నల్లజర్ల	ఎంపీడీవో, తూర్పుగోదావరి జిల్లా
ఎంఎస్‌వీ శ్రీనివాస్	ఆఫీస్/ఆఫ్ మేనేజింగ్ డైరెక్టర్, ఏపీ హెచ్‌సీఎల్, విజయవాడ	ఎంపీడీవో, ఏలూరు జిల్లా

వివాహిత అనుమానాస్పద మృతి

కట్నం వేధింపులే కారణం?



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పెదవేగి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందింది. పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు ఎన్టీఆర్ కాలనీకి చెందిన తీటకాయల పావని కుమార్తె మీనాక్షికి, పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన సురేష్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఏడాదిన్నర వయస్సు పాప ఉంది. వివాహ సమయంలో రూ.ఐదులక్షల కట్నం ఇవ్వడానికి అంగీకరించి, రూ.మూడు లక్షలు ఇచ్చారు. మిగిలిన రూ.రెండు లక్షల కోసం నిత్యం వేధిస్తున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారంరాత్రి పదకొండు గంటల సమయంలో మీనాక్షి తల్లి పావనికి ఫోన్ చేశారు. మీ అమ్మాయి మీనాక్షి గుండెపోటుతో చనిపోయిందని చెప్పగా, మీనాక్షి బంధువులు వచ్చి చూడగా మృతురాలి ఒంటిపై గాయాలున్నట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మృతురాలి తల్లి పావని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసునమోదు చేసి, శవపరీక్షకు మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్ఐ రామకృష్ణలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అత్త గంగమ్మ, మామ ఆదినారాయణ, భర్త సురేష్‌లు తన కుమార్తెను చంపేశారంటూ మృతిరాలి తల్లి పావని కుమార్తె మృతదేహంపై పడి బోరున విలపించింది.



యర్రాయిచెరువు గ్రామంలో పోలీసు పికెట్

ఆంజనేయ స్వామి విగ్రహ ఏర్పాటులో వివాదం

తణుకు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తణుకు రూరల్ మండలం యర్రాయి చెరువు గ్రామంలోని చెరువు గట్టుపై గ్రామస్థులు ఏర్పాటు చేస్తున్న ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఇరగవరం యర్రాయి చెరువు గ్రామస్థులు అడ్డుకోవడంతో శుక్రవారం అర్ధరాత్రి నుంచి రెండు గ్రామాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మూడు గ్రామాలకు సరిహద్దుగా ఉన్న చెరువు ప్రాంతంపై వివాదం నెలకొన్నది. ఆంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు చేసే భూమి తమ గ్రామం పరిధిలో వుందని తణుకు మండల యర్రాయిచెరువు గ్రామస్థులు వాదిస్తున్నారు. అయితే మూడు గ్రామాలకు చెందిన ఉమ్మడి చెరువు అని, పైగా తమ గ్రామానికి సంబంధించిన మంచినీటి రేవును పూడ్చివేసి విగ్రహం ఏర్పాటు చేయడం ఏమిటని ఇరగవరం మండల యర్రాయి చెరువు గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి రెండు గ్రామాల ప్రజలు సరిహద్దు రోడ్డులో మొహరించడంతో ఒక్కసారిగా రెండు గ్రామాల్లో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనితో రెండు గ్రామాల మధ్య పోలీసులు పికెట్, బందోబస్తును ఏర్పాటు చేశారు. రెండు యర్రాయి చెరువు గ్రామాల్లో సమస్యను పరిష్కరించి, శాంతియుత పరిస్థితులు ఏర్పడేలా మాజీ మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, మండల టీడీపీ అధ్యక్షుడు పీతాని మోహనరావు, సానబోయిన దామోదర్, ఇరగవరం మండల టీడీపీ నాయకులు వేండ్ర నాగ రాజేశ్వరరావులు రెండు గ్రామాల పెద్దలతో చర్చలు జరుపుతున్నారు. తణుకు రూరల్ సీఐ బి.కృష్ణ కుమార్ ఆధ్వర్యంలో తణుకు రూరల్ ఎస్ఐ కె.చంద్రశేఖర్, ఇరగవరం ఎస్ఐ జానా సతీష్ తమ సిబ్బందితో పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

విద్యుదాఘాతానికి పెయింటర్ మృతి



పరశురామ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : భవనానికి పెయింటింగ్ వేస్తుండగా విద్యు దాఘాతంతో పెయింటర్ మృత్యువాత పడ్డా డు. దెందులూరు మండలం పోతునూరు గ్రామానికి చెందిన లింగాల పరశురామ్ (31) భార్య, పిల్లలు ఉన్నారు. ఏలూరు వంగాయిగూడెం సమీపంలోని సుబ్రహ్మణ్యం కాలనీలో నివాసం ఉంటున్న ముత్తయ్య (పంజాబ్ నేషనల్ బ్యాంక్ అకౌంటెంట్) ఇంటికి పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం బిల్డింగ్ బయట వైపుగోడకు రోలర్ బ్రెష్‌తో పెయింటింగ్ వేస్తూ దానిని తిరిగి పెయింట్‌లో ముంచే సమయంలో పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ వైరుకు తగిలి అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో పెద్ద మంటలు వచ్చి పరశురామ్ అక్కడికక్కడే మృతి చెందాడు. వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ నాగబాబు తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

బాలికను మోసగించిన వ్యక్తి అరెస్టు

భీమవరం క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి లొంగదీసుకుని గర్భవతిని చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు తెలిపారు. భీమవరంలో ఒక ప్రాంతానికి చెందిన బాలికకు ప్రస్తుతం గునుపూడిలో నివాసముంటున్న భీమవరం మండలం కొత్తపూసలమర్రు గ్రామానికి చెందిన ఎం.లక్ష్మీవరప్రసాద్ మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. బాలిక గర్భవతి కావడంతో పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు లక్ష్మీవరప్రసాద్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

ఊబిలో కూరుకుపోయి కూలీ మృతి



ఏలూరు క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : చెరువులో గుర్రపుడెక్క, తూడు తొలగించడానికి వెళ్ళిన కూలి ప్రమాదవశాత్తు ఊబిలో కూరుకుపోయి మృత్యువాత పడ్డాడు. ఏలూరు తూర్పువీధికి చెందిన తిర్లంగి జీవరత్నం (32) మరికొంతమంది కలిసి ఏలూరు - జంగారెడ్డిగూడెం తంగెళ్ళమూడి వద్ద ఉన్న రామయ్యకోనేరులో గుర్రపుడెక్క, తూడు తొలగించడానికి నాలుగు రోజుల నుంచి పనికి వెళ్తున్నారు. శనివారం ఉదయం తూడు తొలగించడానికి చెరువులో పనిచేస్తున్నారు. కొంత సమయానికి జీవరత్నం కనిపించలేదు. దీంతో అతను ఎక్కడైతే తూడు తొలగిస్తున్నాడో ఆ ప్రదేశాన్ని వెతకగా బురదలో కూరుకుపోయి ఉన్నాడు. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా ఆసుపత్రి అత్యవసర విభాగపు వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు రూరల్ ఎస్ఐ సీహెచ్.కె దుర్గా ప్రసాద్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో ధాన్యం లోడు లారీ బోల్తా



ఉంగుటూరు,ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలం కాకర్లమూడి గ్రామంలో శనివారం ఉదయం ధాన్యం లోడుతో ఉన్న లారీ చెరువులో పడిపోయింది. 500 బస్తాలతో వెళుతున్న ఈ లారీలో సుమారు రూ.5లక్షల విలువైన ధాన్యంతో ప్రభుత్వ పాఠశాల వద్ద అదుపు తప్పింది. దీంతో ధాన్యం మొత్తం నీటి పాలయ్యింది. ఈ విషయమై తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ ఈ ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌మిల్లుకు తోలి రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూస్తామన్నారు. రైతులు రాజాని నాగదుర్గ, నార్ని వెంకటేశ్వరరావు, చనుమోలు ఏసుబాబులకు చెందిన ధాన్యం కావడంతో వారు ఆందోళన చెందారు. దీనిపై జిల్లా అధికారులను సంప్రదించామని రైతులకు ఇబ్బంది ఉండని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు.

రేపు బీచ్ కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

తణుకు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక ఈనెల 28న తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రులో జిల్లా పురుషుల, మహిళల బీచ్ కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అప్పలరాజు, వై.శ్రీకాంత్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే మహిళలు 75 కిలోల లోపు, పురుషులు 85 కిలోల లోపు బరువున్న వారు అర్హులని తెలిపారు. పోటీల్లో ఎంపికైన వారు మే 2 నుంచి 4వ తేదీ వరకు కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలలో జిల్లా జట్టు తరపున పాల్గొంటారన్నారు. వివరాలకు 94913 33906, 96424 96117 సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి డెల్టా కాలువల మూసివేత

ధవళేశ్వరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రబీ అనంతరం ఖరీఫ్ నాటికి పంట కాలువలను సిద్ధం చేయడానికి కాల్వలపై ఉన్న లాకులు, షట్టర్లు వంటి వాటికి మరమ్మతులు చేయడానికి వీలుగా డెల్టా కాలువలను ఆదివారం నుంచి మూసివేసి జూన్‌లో ఖరీఫ్‌కు నీటిని విడుదల చేయనున్నారు. ఆదివారం ఉదయం నుంచి డెల్టా కాలువల నీటి విడుదలను క్రమంగా తగ్గిస్తూ సాయంత్రానికి హెడ్ స్లూయిస్‌ల గేట్లను పూర్తిగా దించివేసి నీటి విడుదలను నిలిపిస్తారు. ప్రస్తుతం తూర్పుడెల్టాకు 300 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 700 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 3వేల క్యూసెక్కులు విడుదలవుతున్నాయి.

బీచ్‌లో మృతదేహం లభ్యం



లాలూ నాయక్

మొగల్తూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పేరుపాలెం సాగర తీరంలో శుక్రవారం గల్లంతైన యువకుడు మృత దేహం శనివారం తీరానికి కొట్టుకు వచ్చింది. ద్వారకాతిరుమల మండలం సత్తెనగూడెం నుంచి 10 మంది యువకులు శుక్రవారం పేరుపాలెం బీచ్‌కు వచ్చారు. వీరిలో ఇద్దరు యువకులు సముద్రస్నానం చేస్తుండగా గల్లంతవుతుండగా వీరవల్లి మధు అనే యువకుడుని స్థానికులు, పోలీసులు ఒడ్డుకు తీసుకువచ్చి రక్షించగా మరో యువకుడు లాలూ నాయక్ (17) అలల తాకిడికి కొట్టుకుపోయాడు. శనివారం ఉదయం తీరానికి విగత జీవిగా కొట్టుకురాగా కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జీ.వాసు తెలిపారు.

జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్



ఏలూరు క్రైం : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సిరిపురం శ్రీదేవిని కలెక్టర్ వెట్రిసెల్వి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీదేవికి పూలమొక్కను అందించి వెట్రిసెల్వి శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా రామాలయం వార్షికోత్సవం

పెదవేగి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : లక్ష్మీపురంలోని శ్రీకోదండ రామాలయం వార్షికోత్సవ వేడుక శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం సీతారాములకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. లక్ష్మీపురంతోపాటు పెదవేగి, గార్లమడుగు, ఎంఆర్‌సీ కాలనీ, వీరంపాలెం గ్రామాలనుంచి భక్తులు అన్న సమారాధనలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిని సవరించాలి

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా హైస్కూళ్లలో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిని 1:53కి పెంచడాన్ని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తక్షణమే ఈ నిష్పత్తిని 1:40గా సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. సెక్షన్ల ప్రాతిపదికన స్కూల్ అసిస్టెంట్ పోస్టును కేటాయించడం వల్ల ప్రతీ పాఠశాలలో సర్ ప్లస్(మిగులు) ఉపాధ్యాయులు అధికమయ్యారని, వీరిని ఏం చేయాలనే ప్రత్యామ్నాయాలు వెదకడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. నిష్పత్తిని సవరించి స్కూల్ అసిస్టెంట్లను ఉన్నత పాఠశాలల్లోనే కొనసాగిస్తే విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు.

ముగిసిన గణిత సామర్థ్య శిక్షణ తరగతులు

పెదపాడు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న గణిత సామర్థ్యం శిక్షణ తరగతులు శనివారంతో ముగిసింది. మూడ్రోజుల పాటు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఏలూరు, కృష్ణా, పశ్చిమ, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన గణిత ఉపాధ్యాయులు పాల్గొనగా, వారికి విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎ.ఎం.ఓ. శాంతి విశాల, అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ రిసోర్స్ పర్సన్ రేష్మకృష్ణన్, ఫణితేజ, జిల్లా డీసీవో ఉమాకుమారి, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

పట్టిసీమ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



అలంకరణలో స్వామివారు

పోలవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ సుదర్శన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తుల తాకిడి ఎక్కువైంది. పోలవరం మండల పరిసర ప్రాంతాల నుంచి తాళ్ళపూడి, గోపాలపురం మండల పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళా భక్తులు కాలినడకన ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు శంకరమంచి వెంకట్రామశర్మ ఆధ్వర్యంలో భూదేవి శ్రీదేవి సమేత సుదర్శన కల్యాణ వేంకటేశ్వరస్వామికి విష్ణు సహస్రనామ పారాయణ, అర్చనలు, ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. పోలవరం ఆంజనేయస్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా ఆంజనేయుడికి అయ్యప్ప ఆలయంలో నవగ్రహాల పూజలు, శనిపూజలు అర్చకులు పైడిపల్లి ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

ఏలూరురూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి):ఆర్య వైశ్యకుటుంబాల్లోని ఉత్తమ విద్యార్థులకు నగదు పురస్కారం అందజేస్తున్నట్టు అధ్యక్ష ప్రధాన కార్యదర్శి దివ్వెల జయప్రకాష్, వి.రామకృష్ణారావు తెలిపారు. శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి సత్రం యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల విడుదలైన టెన్త్, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారం అందజేస్తున్నట్టు తెలిపారు. ఏలూరు నియోజకవర్గానికి చెందిన ఆర్య వైశ్య విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దరఖాస్తులను లాటరీ ద్వారా ఎంపిక చేసి తరగతికి ఇద్దరు చొప్పున విద్యార్థులకు అందజేయనున్నట్టు తెలిపారు. ఆరుగురికి 5000 చొప్పున అందజేసినట్లు తెలిపారు. మే 4వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలని, వివరాలకు 99668 47776 నెంబర్లో సంప్రదించవలసిందిగా మద్దుల సత్యకుమార్ మోతే చలపతిరావు, వేమా కోటేశ్వరరావు తెలిపారు.

ఎర్రచెరువు కాలనీ ముంపునకు పరిష్కారం చూపాలి

టి.నర్సాపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి):ఎర్రచెరువు కాలనీ వరదముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రవి కోరారు. బర్రింకలపాడులోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండ్ ప్రాంతంలో యర్ర చెరువు కాలనీలో సుమారు 400మంది నిరుపేద కుటుంబాలు నివాసం ఉంటున్నారని ఆయన తెలిపారు. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో వచ్చే వరదలకు కాలనీ ముంపుకు గురై ప్రజలు నిరాశ్రయులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెట్టగూడెం రోడ్డులో హైలెవిల్‌కల్వర్టు నిర్మాణం చేపట్టి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచాలని ఆయన కోరినట్లు తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు పంపిణీ

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోను ఇతర పాఠశాలల్లో ఎన్‌రోల్ అయిన విభిన్న ప్రతిభావంతులైన పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వం పలు విధాలుగా ఆదుకుంటోందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఇలు వంటి పిల్లలను ఆదుకునేందుకు మండలంలోని పంగిడిగూడెం భవిత స్కూల్ ఉందన్నారు. ఈక్రమంలో జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని 15 మంది విభిన్న ప్రతిభావంతులైన పిల్లలకు సహాయ ఉపకరణాలను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు.మండలంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు 110 మంది ఉన్నట్లు గుర్తించామని, వీరికి ప్రతీ వారం ఫిజియోథెరపిస్ట్ ఆధ్వర్యంలో వ్యాయామాలు చేయిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో పరసా వెంకట్రావు, టీడీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

పశు వైద్యులు సాంకేతిక నైపుణ్యాలు వినియోగించాలి

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : గిరిజన భవనం వద్ద శనివారం ప్రపంచ పశు వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త సంచాలకులు టి.గోవిందరాజు వైద్యులకు విధి నిర్వహణలో అవలంబించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు సాంకేతిక నైపుణ్యాలను వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా గోవిందరాజు దంపతులను యూనియన్ నాయకులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు డాక్టర్ కాల్వ కోటేశ్వరరావు, కె.చంద్రశేఖరరావు, బి.సుబ్రహ్మణ్యేశ్వరి, క్రాంతి భూషణరాజు, ధూళిపాళ్ళ నరేంద్రనాథ్, ఆనందరావు, విద్యాసాగర్, కొసరాజు ప్రసాద్, సాయిరమేశ్, రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు పంపిణీ

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోను ఇతర పాఠశాలల్లో ఎన్‌రోల్ అయిన విభిన్న ప్రతిభావంతులైన పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వం పలువిధాలుగా ఆదుకుంటోందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఇటువంటి పిల్లలను ఆదుకునేందుకు మండలంలోని పంగిడిగూడెం భవిత స్కూల్ ఉందన్నారు. ఈక్రమంలో జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని 15 మంది విభిన్న ప్రతిభావంతులైన పిల్లలకు సహాయ ఉపకరణాలను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో పరసా వెంకట్రావు, టీడీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో చెస్ టోర్నమెంట్ ప్రారంభం

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి):సీపీఐ కార్యాలయం వద్ద శనివారం జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్‌ను యూనియన్ నాయకులు, ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదరంగం పోటీలు పిల్లల మేధస్సు శక్తిని పెంచడానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసడాంగే, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నగర కార్యదర్శి అప్పలరాజు, బి.జగన్నాథరావు, పళ్ళెం కిషోర్, భజంత్రి శ్రీనివాస్, యర్రా వెంకటేశ్వర్లు, కె.జగన్ పాల్గొన్నారు.

ఉప్పుటేరు ఆక్రమణలు తొలగించాలి

(5వ పేజీ తరువాయి)

పశ్చిమ గోదావరి జిల్లాలోని నీరంతా కొల్లేరు, ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి వెళ్లాల్సి ఉందన్నారు. ఉప్పుటేరు వెంబడి ఆక్రమించిన రైతులు తమ చెరువులన్నీ రొయ్యలు, చేపలను ఖాళీ చేసి అప్పగించాలన్నారు. కొల్లేరు ప్రజలకు కాంటూరు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామని సుప్రీంకోర్టు ఇచ్చిన 12 వారాల గడువులో పక్షులు, పర్యావరణంతో పాటు ప్రజలు ఉన్నట్టు గుర్తించిం దన్నారు. త్వరలోనే ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. రాష్ట్ర టీడీపీ వడ్డీ సాధికారిక కమిటీ కన్వీనర్ బలే ఏసు రాజు, రాష్ట్ర చేపల రైతు సంఘం అధ్యక్షుడు నంబూరి వెంకటరామరాజు, ఎంపీపీ అడవి కృష్ణ, కూటమి నాయకులు పెన్మెత్స త్రినాథరాజు, పొత్తూరి వాసురాజు, పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సర్వీసు లోడుపై 50 శాతం రాయితీ



లింగపాలెం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : అదనపు విద్యుత్‌ను వినియోగిస్తున్న వినియోగదారులు తమ విద్యుత్ సర్వీసుల లోడును 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులకు సువర్ణావకాశం కల్పించింది. గతంలో విద్యుత్ అధికారులు తనిఖీల సమయంలో సర్వీస్ లోడుకు విద్యుత్ వినియోగానికి తేడాలుంటే అధికంగా ఫైన్‌లు విధించేవారు. విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడుపై అవగాహన లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయేవారు. ఇక నుంచి వినియోగదారులు నష్టపోకుండా అదనపులోడును క్రమబద్ధీకరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీ ప్రకటించింది. విద్యుత్ కనెక్షన్ తీసుకునే సమయంలో ఎంత మొత్తంలో విద్యుత్ వినియోగిస్తారో ఆ లోడ్‌ను కిలో వాట్లలో లెక్కించి ఆ మేరకు దరఖాస్తుకు రూ.50, డెవలప్‌మెంట్ చార్జీలు 2వేలు, సెక్యూరిటీ డిపాజిట్ 2వందలు మొత్తం 2,250 రూపాయలు చార్జ్ చేసేవారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారునికి 50 శాతం రాయితీ ప్రకటించడంతో అన్ని చార్జీలు కలిపి ప్రతి కనెక్షన్‌కు రూ.1250 చెల్లిస్తే సరిపోతుంది.

ఈ అవకాశాన్ని వినియోగించుకోండి



మండలంలోని ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో 14 వేలకు పైగా ఇంటి కనెక్షన్‌లు, 8వేల వ్యవసాయ కనెక్షన్‌లు ఉన్నాయి. వీరందరికీ అదనపులోడును క్రమ బద్ధీకరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంచి అవకాశం కల్పించింది. అదనపులోడు క్రమబద్ధీకరణకు ఏప్రిల్ 30వ తేదీ వరకు అవకాశం ఉంది. ఈ విషయంపై వినియోగదారులకు వివిధ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి ఒక్కరూ తమ విద్యుత్ సర్వీసులు క్రమబద్ధీకరించుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

కె.అంబేడ్కర్, డీఈ విద్యుత్ శాఖ, జంగారెడ్డిగూడెం



ధాన్యం మాసూళ్లు చేస్తున్న యంత్రం

ముమ్మరంగా ధాన్యం మాసూళ్లు

లింగపాలెం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలో దాళ్వా పంట చేతికి రావడంతో వరికోతలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ అధికారులు మండల వ్యాప్తంగా లింగపాలెం, రంగాపురం, కె.గోకవరం, ధర్మాజీగూడెం,మఠంగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముందుగానే ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే ముందు గింజ గట్టిపడి తేమ లేకుండా బంగారు వర్ణంలోకి మారేవరకు కోతలు కొయ్యకూడదని మండల వ్యవసాయాధికారి కోటగిరి మురళీకృష్ణ సూచించారు. మట్టిపెల్లలు రాకుండా శుభ్రంగా ధాన్యం నాణ్యతతో ఉంటే మద్దతు ధర లభిస్తుందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకు రావాలని సూచించారు.

వేధింపుల కేసు నమోదు

పెదపాడు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : వేంపాడు గ్రామానికి చెందిన సాయల మధులత ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త సాయల బాబూరావు, భర్త కుటుంబ సభ్యులు రమేశ్, దేవమాత, సంజీవరావులపై వేధింపుల కేసు నమోదైంది. భర్తతో పాటు ఆయన కుటుంబ సభ్యులు అధిక కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నారని మధులత శనివారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పెదపాడు ఎస్సై కట్టా శారద కేసు నమోదు చేశారు.

కొనసాగిన ఎన్‌సీసీ క్యాంపు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ కేడెట్లకు నిర్వహిస్తున్న వార్షిక క్యాంపు మూడో రోజు కార్యక్రమాల్లో భాగంగా శనివారం కేడెట్లకు ట్రాఫిక్ నిబంధనలు, డ్రైవింగ్ లైసెన్సు తీసుకునే విధానంపై అవగాహన కల్పించారు. సీఆర్‌ఆర్ పబ్లిక్ స్కూలు, అటానమస్ కళాశాల మైదానంలో ఫైరింగ్ డెమో తరగతులు నిర్వహించారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయ అనివేటి మండప ప్రాంతంలో మహిళలు, చిన్నారులు శనివారం నిర్వహించిన కోలాట ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. కోలాట సమాజ మహిళలు, బాలలు ముందుగా క్షేత్రానికి వచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆ తరువాత వివిధ దేవతా మూర్తులను కీర్తిస్తూ వారు ఆలయ అనివేటి మండపంలో నిర్వహించిన కోలాట ప్రదర్శనతో ఆ ప్రాంతంలో ఆధ్యాత్మికత శోభిల్లింది.

రెండో దశ రీసర్వే ప్రారంభం

లింగపాలెం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): గతప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వే తప్పుల తడకగా ఉండటంతో వాటిని సరిదిద్ది ప్రతి రైతుకు న్యాయం చేసేలా రాష్ట్రప్రభుత్వ చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ప్రారంభమైన రెండోదశ రీ సర్వేలో భాగంగా మండలంలో పుప్పాలవారిగూడెం గ్రామంలో రెవెన్యూ అధికారులు శనివారం రీ సర్వే ప్రారంభించినట్లు తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. గ్రామంలో మొత్తం 765 ఎకరాలకు రీసర్వే చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో రైతులకు రీసర్వేపై అవగాహన కలిగేలా గ్రామ సభ నిర్వహించారు. అ శనివారం గ్రామానికి సంబందించిన బౌండరీలైన్‌ను గుర్తించామని అన్నారు. అనంతరం గ్రామంలో గ్రామసభ నిర్వహించి రైతులకు రీసర్వేపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డీటీ నాగబాబు, మండల సర్వేయర్ ప్రేమ్‌కుమార్, విఆర్‌వోలు, గ్రామ సర్వేయర్‌లు పాల్గొన్నారు.

ఉగ్రమూకలపై ఆగ్రహ జ్వాలలు



చింతలపూడిలో నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు



జంగారెడ్డిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : పహల్గాంలో టెర్రరిస్టుల దుశ్చర్యను ఖండిస్తూ మృతులకు శనివారం రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. విహార యాత్రకు వచ్చిన యాత్రికులపై ఉగ్రవాదుల పిరికిపంద చర్యగా అభివర్ణించారు. సంఘ నాయకులు నారాయణ, పవన్ కుమార్, రత్నాకరరావు, రాఘవులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్ : కశ్మీర్లోని పహల్గాంలో ఉగ్రదాడిని అల్లూరి సీతారామరాజు వాకర్స్ అసోసియేషన్ ఖండించింది. ఈ మేరకు శనివారం ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియంలో నిరసన తెలిపారు. ఆ ఉగ్రవాదులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ గౌరవాధ్యక్షుడు అక్బర్, అధ్యక్షులు పత్తిపాటి నాగ విగ్నేశ్వరరావు, సెక్రటరీ విశ్వనాథం మాధవరావు, ట్రెజరర్ కొమ్మా నాగరాజు, మహిళా వాకర్ అధ్యక్షురాలు మేరి మాణిక్యం సత్యవతి, జల్లా వీరభద్ర, ఎస్.కె.లాల్ సాహెబ్, తెలుగుదేశం సీనియర్ నాయకులు జంపా సూర్య నారాయణరావు, మేడపల్లి ఏసుబాబు పాల్గొన్నారు.

●చింతలపూడి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పహల్గాంలో జరిగిన అమానుష ఉగ్రవాద దాడిని ఖండించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు పోయిన వారికి సంతాపం వ్యక్తం చేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అమాయక పర్యాటకులు 20 మంది ప్రాణాలు కోల్పోవడం దారుణమని, ఇది కేవలం వ్యక్తులపై దాడి కాదని, యావత్ భారత ప్రజాస్వామ్య విలువలపై దాడి అని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నరేంద్ర కుమార్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం : ఉగ్రదాడిని ఖండిస్తూ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి బోసు బొమ్మ సెంటర్ వరకూ ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ మాట్లాడుతూ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ పట్టణాధ్యక్షుడు రావూరి కృష్ణ, రాష్ట్ర శెట్టి బలిజ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వర రావు, మాజీ సర్పంచ్ మండవల్లి విజయసారథి, మాజీ సైనిక సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు దొమ్మేటి సత్యనారాయణ, కార్యదర్శి పేరూరి భద్రయ్య పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసులు పెడతాం



మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కృష్ణబాబు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మైనర్లకు ద్విచక్ర వాహనాలిస్తున్న తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని జంగారెడ్డిగూడెం సీఐ కృష్ణబాబు హెచ్చరించారు. శనివారం పట్టణంలో ద్విచక్రవాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ద్విచక్రవాహనాలు నడుపుతున్న మైనర్లను గుర్తించి వారికి అవగాహన కల్పించారు. వారి తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి కౌన్సెలింగ్ ఇచ్చారు. పాఠశాలలకు సెలవులివ్వడంతో పిల్లలు రోడ్లపై ఇష్టమొచ్చినట్టు వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

లింగపాలెం : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐలు కె.వెంకన్న, సి.హెచ్. రాజశేఖర్ తెలిపారు. లింగపాలెం మండలంలో ద్విచక్ర వాహనదారులకు మోటార్ వాహనాల చట్టంపై అవగాహన కల్పించారు.ద్విచక్రవాహనం నడుపుతున్న వారితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డుభద్రతా ప్రమాణాలు పాటించని వారికి రూ. వెయ్యి జరిమానాతో పాటు కేసు నమోదు చేసి లైసెన్సు రద్దు చేసే అవకాశముందన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించేలా అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమని అన్నారు.



నూతన కమిటీని సన్మానిస్తున్న దృశ్యం

అంజుమన్ కమిటీ సభ్యులకు సత్కారం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : అంజుమన్ మహా ఫీజుల్ ఇస్లాం సంస్థ నూతన కమిటీ సభ్యులను డాక్టర్ షేక్ సయ్యద్ బాజీ(గాజుల బాజీ) అధ్యక్షతన ఘనంగా సత్కరించారు. అంజుమన్ సమస్యలు అభివృద్ధి పథంలోని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో గొలుసులు పంజా ముజావర్లు ఎండి వజీర్ ఆలి ఎండి గాలబ్ ఆలి, జనాబ్ అబ్బు భాయ్, జనాబ్ జాని, రజాక్ పాల్గొన్నారు.

అభివృద్ధికి జడ్పీ నుంచి సహకరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న పద్మశ్రీ

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): గోపాలపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు జడ్పీ నుంచి ఎటువంటి సాయం కావాలన్నా అందజేస్తామని ఉభయ గోదావరి జిల్లాల జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. ద్వారకాతిరుమల ఎంపీపీ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం ఎంపీపీ బొండాడ మోహిని అధ్యక్షత జరిగిన సర్వసభ్య సమావేశంలో ఘంటా పద్మశ్రీ పాల్గొని మాట్లాడుతూ ద్వారకాతిరుమల మండలంలో డ్రైనేజీల నిర్మాణం నిమిత్తం జడ్పీనిధులు రూ.86 లక్షలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మండల వారీగా అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. అనంతరం అధికారులకు పలు సమస్యల పరిష్కారానికి ఆయన సూచనలు, సలహాలు అందజేశారు. సమావేశంలో జడ్పీటీసీ సి.హెచ్. శామ్యూల్, ఎంపీడీవో పీవీవీ ప్రకాశ్, తహసీల్దారు జె.వి. సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



అందుకున్న అవార్డులతో చిన్నారులు

కుంగ్ ఫూ చిన్నారులకు అవార్డులు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి):న్యూ మాంక్స్ కుంగ్ ఫూ డోజో విద్యార్థుల అవార్డుల ప్రదానోత్సవం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి సీఐ కృష్ణబాబు ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు అవార్డులు అందజేసినట్టు ఆ సంస్థ నిర్వాహకుడు కుంగ్ ఫూ మాస్టర్ గంధం సురేష్ తెలిపారు. కుంగ్ ఫూ కోర్సులలో ప్రతిభ ఆధారంగా సాధించిన వైట్,యెల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, బ్రౌన్ బెల్ట్‌లను, సర్టిఫికెట్లను విద్యార్థులకు సీఐ కృష్ణబాబు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది మారిశెట్టి అంజన్‌కుమార్, కుంగ్ ఫూ అసిస్టెంట్ ఇన్‌స్ట్రక్టర్ మణిశర్మ, సతీశ్ పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ఏలూరుకార్పొరేషన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని సత్రంపాడులోని శ్రీ లక్ష్మీగణపతిస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామిని ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట బొద్దాని శ్రీనివాస్, గూడవల్లి వాసు, రెడ్డి నాగరాజు, ఆర్ఎస్ఆర్ నాగేశ్వరరావు ఉన్నారు.



ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

లింగపాలెం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతమయ్యేలా అధికారులు, స్థానిక నాయకులు కలిసి పని చెయ్యాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. ఇటీవల విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌కు లింగపాలెం మండల నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై నాయకులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో గరిమళ్ల చలపతిరావు, మోరంపూడి మల్లికార్జునరావు, బొల్లినపుల్లారావు, పల్లి శ్రీను, పొదిల శౌరి, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా మహన్యాసపూర్వక రుద్రాభిషేకం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): క్షేత్రపాలకుడైన శివదేవుని ఆలయంలో శనివారం ఉదయం జరిగిన మహన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకం, రాత్రి జరిగిన వాహన సేవ భక్తులను అలరించింది. లోకకల్యాణార్థం మాసశివరాత్రి, శనిత్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ సేవలు భక్తులకు కనువిందు అయ్యాయి. ముందుగా ఆలయపరిసరాలను పుష్పమాలికలు, మామిడితోరణాలతో సుందరీకరించారు. ఆ తరువాత ఆలయ గర్భాలయంలో కొలువైన శివయ్యకు అర్చకులు పండితులు వేదమంత్రోచ్ఛరణల నడుమ రుద్రాభిషేకాన్ని జరిపారు. రాత్రి వాహనంపై శివయ్యను, అమ్మవార్లను ఉంచి అలంకరించి అనంతరం మేళతాళలతో జరిగిన గ్రామోత్సవం చూపరులకు నేత్రపర్వమైంది.

పశువైద్యంలో జాగ్రత్తలు పాటించాలి

జీలుగుమిల్లి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పశువైద్య దినోత్సవం జీలుగుమిల్లి పశు వైద్యశాల వద్ద ఘనంగా నిర్వహించారు. పశువులకు రోగాలు సోకిన సమయంలో వైద్యం అందించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జీలుగుమిల్లి పశు వైద్యశాల సహాయ సంచాలకులు సాయిబుచ్చారావు అన్నారు.

ముగిసిన డీఎల్ఎడ్ పరీక్షలు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): డీఎల్ఎడ్ పరీక్షల్లో భాగంగా శనివారం జరి గిన 3వ సెమిస్టర్ పరీక్షలకు 45మంది, 1వ సెమిస్టర్ పరీక్షలకు 89మంది హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. వీటితో పరీక్షలు ముగిశాయని తెలిపారు.

విద్యార్థులకు సన్మానం

పెదవేగి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : వేగివాడ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని దొర్రాజు కుసుమశ్రీ 570 మార్కులతో మండలం ద్వితీయ స్థానం, సింధూర(549) పాఠశాల ద్వితీయ స్థానం సాధించింది. ఈ మేరకు విద్యార్థులను ఉపాధ్యాయుల సమక్షంలో సర్పంచ్ పి.ప్రభావతి సూర్యచంద్రరావు ఘనంగా సత్క రించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధనకు కష్టపడి చదవాలన్నారు.

ఆకతాయిలు వేధిస్తే 112కు కాల్ చేయండి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రాంతాల నుంచి ఏలూరు నగరానికి కోచింగ్ నిమిత్తం వచ్చే విద్యార్థినులకు ఎవరైనా ఆకతాయిల వేధింపులు ఎదురైనా వెంటనే 112కు సమాచారం అందించాలని జిల్లా అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు సూచించారు. ఏలూరులో ఉన్న ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో విద్యార్థినులకు శనివారం శక్తిటీమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ ఎవరైనా ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే 112కు సమాచారమందిస్తే పది నిముషాల్లో శక్తి టీమ్ అక్కడకు చేరుకుంటుందన్నారు. శక్తియాప్‌ను ప్రతి ఒక్క తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఎవరైనా ఫోన్లు చేసి బెదిరిస్తే వెంటనే 1930కు సమాచారం అందించాలన్నారు.

ఈ వృద్ధురాలిని గుర్తించి చిరునామా చెప్పండి



ఏలూరు క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఒక గుడి వద్ద రెండ్రోజుల నుంచి ఉంటూ కనీసం తన పేరు కూడా చెప్పలేని స్థితిలో ఉన్న ఆమె (65) వివరాలు తెలిసిన వారు పోలీసులకు తెలియజేయాలని రూరల్ ఎస్ఐ సి.హెచ్.కె.దుర్గా ప్రసాద్ కోరారు. చాటపర్రులోని ఒక గుడివద్ద రెండు రోజుల నుంచి ఒక వృద్ధురాలు ఉంటోందని తన పేరు, ఊరు కూడా చెప్పలేని స్థితిలో ఉందని వన్‌స్టాప్ సెంటర్‌లో ఉంచామన్నారు. సమాచారం తెలిస్తే (94407 96636) తెలపాలని ఎస్ఐ దుర్గా ప్రసాద్ కోరారు.

ఊబిలో కూరుకుపోయి కూలీ మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు తూర్పువీధికి చెందిన తిర్లంగి జీవరత్నం (32) మరికొంతమంది కలిసి ఏలూరు - జంగారెడ్డిగూడెం తంగెళ్ళమూడి వద్ద ఉన్న రామయ్యకోనేరులో గుర్రపుడెక్క, తూడు తొలగించడానికి నాలుగు రోజుల నుంచి పనికి వెళ్తున్నారు. శనివారం ఉదయం తూడు తొలగించడానికి చెరువులో పనిచేస్తున్నారు. కొంత సమయానికి జీవరత్నం కనిపించలేదు. దీంతో అతను ఎక్కడైతే తూడు తొలగిస్తున్నాడో ఆ ప్రదేశాన్ని వెతకగా బురదలో కూరుకుపోయి ఉన్నాడు. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు.

సహాయకుల పోస్టులకు ఇంటర్వ్యూలు

నూజివీడు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 8 అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 11మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. కార్యక్రమంలో నూజివీడు సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్, సీడీపీవో ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లంక గ్రామాల్లో అడుగంటిన తాగునీటి చెరువులు

రంగు మారిన నీరు.. దుర్వాసన


కొడంగిలో అడుగంటిన తాగునీటి చెరువు

కలిదిండి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో లంక గ్రామాలైన కొండంగి, మట్టగుంట, పెదలంక, మూల్లంక, భాస్కరావుపేట, సంతోషపురం గ్రామాల్లో తాగునీటి చెరువులు అడుగంటాయి. చెరువుల్లో నీరు రంగు మారాయి. తాగటానికి ఆమోదయోగ్యంగా లేకపోవటంతో ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌లో బిందెడు నీరు రూ.10 చొప్పున కొనుగోలు చేసి తాగుతున్నారు. ఫిల్టర్ బెడ్లు పని చేయకపోవటంతో చెరువుల్లో రంగుమారిన నీరును నేరుగా కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఈ నీటిని వాడకానికి మాత్రమే ఉపయోగిస్తున్నారు. గతంలో తాగు నీటి వంతు పూర్తిగా ఇవ్వకపోవటంతో పలు గ్రామాల్లో తాగునీరు చెరువులను పూర్తిస్థాయిలో నింపలేకపోయారు. దీంతో చెరువుల్లో నీటి మట్టాలు తగ్గి అడుగంటడంతో నీరు రంగు మా రి కలుషితమయ్యాయి. కొండంగిలో తాగునీటి చెరువు రంగు మారి కలుషితమవ్వటంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నది. దీంతో చెరువులో నీరును మోటార్ పంపు సెట్‌లో బయటకు తోడేసి చెరువును ఎండగట్టారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. పలువురు దాతలు ముందుకొచ్చి వాటర్ ట్యాంకర్లలో తాగునీరు సరఫరా చేస్తున్నారు. పెదలంకలో తాగునీటి చెరువులో నీటి మట్టం తగ్గిపోవటంతో నీరు రంగు మారింది. భాస్కరావుపేట, మూల్లంక తాగునీటి చెరువులు అడుగంటడంతో తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపే వరకు తాగునీటి వంతు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం దృశ్యం

కలిదిండి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్ అన్నారు. శనివారం చినతాడినాడలో మత్స్యకారులకు వేట నిషేధితకాల భృతిని రూ.20 వేలకు పెంచటంతో మత్స్యకారులతో కలసి సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో వేట నిషేధిత కాలంలో మత్స్యకారులకు జీవన భృతి రూ.10 వేలు మాత్రమే ఇచ్చే వారని కూటమి ప్రభుత్వ అధికారంలోకి రాగానే డబుల్ చేసి రూ.20 వేలు ఇస్తుందన్నారు. సుమారు లక్షా 30 వేల మంది మత్స్యకారుల ఖాతాలో రూ.258 కోట్లు జమ చేశారన్నారు. కార్యక్రమంలో మత్స్యకారుల సంక్షేమమే సంఘం నాయకులు సోర్రా అరవింద్, మోకా వెంకటేశ్వర్లు, సింగిడిమిల్లి శ్రీనివాసరావు, సంగాని రామకృష్ణ, నడకుదిటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రెయిన్‌ల ఆక్రమణలు తొలగిస్తాం

- రెండు చోట్ల ఇసుక స్టాక్ పాయింట్లు
- త్వరలో గోపవరంలో వంతెన నిర్మాణం
- అధికారులు పూర్తిస్థాయిలో తాగునీటి చెరువులు నింపాలి
- నవంబరు నాటికి హైవే విస్తరణ పనులు పూర్తి
- కైకలూరు మండల సమావేశంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్

కైకలూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా అన్ని మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం కైకలూరు మండల పరిషత్ సర్వసభ్యసమావేశాన్ని ఎంపీపీ అడవి వెంకటకృష్ణమోహన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచినీటి చెరువులు నింపే గ్రామాల్లో విద్యుత్ కోతలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంచినీటి చెరువులను నింపేందుకు ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి చెరువులను నింపాలన్నారు. కైకలూరు పట్టణంలో ముంపు లేకుండా పుల్లవ డ్రెయిన్, వార్లకోడు, శాంప్ డ్రెయిన్ ఆక్రమణలు తొలగిస్తామని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కైకలూరులో రెండు చోట్ల ఇసుక స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేస్తామన్నారు. పుల్లవా డ్రెయిన్‌పై గోపవరంలో వంతెన నిర్మాణానికి రూ.2.5కోట్లు మంజూరయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభిస్తారన్నారు. జాతీయ రహదారి విస్తరణ పనులు నవంబర్ నాటికి పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటారన్నారు. ఉప్పుటేరు నుంచి ఆలపాడు, పల్లెవాడ గ్రామాలకు లిఫ్ట్‌ఇరిగేషన్ ద్వారా నీరు తీసుకువచ్చేందుకు సాధ్యసాధ్యాలపై అధికారులు పరిశీలించాలని సూచించారు. ఇటీవల నూతనంగా ఎంపికైన వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, జడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ళ బేబి, ఇన్‌చార్జి ఎండీవో ప్రకాశరావు పాల్గొన్నారు.


చాట్రాయి, ముదినేపల్లి, ఆగిరిపల్లిలలో వాహనదారులకు పోలీసుల కౌన్సెలింగ్

విస్తృతంగా పోలీసుల వాహన తనిఖీలు

హై అలర్ట్

- కశ్మీర్‌లో ఉగ్రదాడితో ముందస్తు భద్రతా చర్యలు
- హోటళ్లు, లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు
- అప్రమత్తంగా ఉండాలని పోలీస్ శాఖకు ఆదేశాలు
- డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లతో తనిఖీలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా పలు పట్టణాల్లో భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లాలో పాకిస్థానీలు ఉంటే ఈ నెల 27వ తేదీలోపు తమ దేశానికి వెళ్ళిపోవాలని ఏలూరు జిల్లా ఎస్పీ కె.పి.ఎస్.కిశోర్, పశ్చిమ గోదావరి జిల్లా అద్నాన్ నయీం అస్మిలు హెచ్చరించారు. తదుపరి ఎవరైనా ఉంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉంటే శనివారం తెల్లవారు జాము నుంచే ప్రత్యేక పోలీస్ బలగాలు, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లతో తనిఖీలు చేశారు. ఆలయాల్లో దర్శనానికి వచ్చే భక్తులను సైతం తనిఖీలు నిర్వహించారు. ఇంకోవైపు శనివారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ జిల్లా వ్యాప్తంగా నాకాబందీ నిర్వహించారు. జిల్లాలోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన కూడళ్ళల్లో తనిఖీలు చేపట్టారు. వాహనాలను కూడా తనిఖీలు చేశారు. ఏలూరు నగరంలో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో పోలీసు జాగిలాలతో తనిఖీలు చేయించారు. ఏలూరు కొత్తబస్టాండ్‌లోని పార్శిల్ కార్యాలయంలోని పార్శిళ్లను కూడా పోలీస్ జాగిలాలతో పరిశీలన చేయించారు. భీమవరం పట్టణంలోని హోటళ్ళు, లాడ్జిలలో బస చేస్తున్నటువంటి వ్యక్తుల తనిఖీలు, వారి వివరాలు సేకరణ, ధ్రువపత్రాల పరిశీలించి లాడ్జీలు, హోటళ్ల నిర్వాహకులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో జన సంచారం ఎక్కువగా ఉండే మార్కెట్లు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు, బస్ స్టేషన్లు,రైల్వే స్టేషన్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడమే లక్ష్యంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనిస్తే తక్షణమే పోలీసు అధికారులకు సమాచారం అందించాలని జిల్లా పోలీసు ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేశారు.

పాక్‌జాతీయుల వీసాలు నిలిపివేత...

ఏలూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : పాకిస్థానీ పౌరులకు భారత ప్రభుత్వం జారీ చేసిన అన్ని చెల్లుబాటు అయ్యే వీసాలు ఏప్రిల్ 25వ తేదీ నుంచి రద్దుకానున్నాయని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మెడికల్ వీసాలు, దౌత్య, అధికారిక వీసాలు మినహా అన్ని చెల్లుబాటయ్యే వీసాలు ఏప్రిల్ 27వ తేదీ నుంచి రద్దు కానున్నాయన్నారు. పాకిస్తానీ పౌరులకు జారీ చేసిన మెడికల్ వీసా ఏప్రిల్ 29 వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయన్నారు.

జిల్లాలో పాకిస్థానీయులు ఉంటే..

ఏలూరు క్రైం : ఏలూరు జిల్లా పరిధిలో పాకిస్థాన్ దేశానికి చెందిన పౌరులు ఉంటే తప్పనిసరిగా ఈ నెల 27వ తేదీ లోపు భారత దేశాన్ని విడిచిపెట్టి వెళ్లాలని ఎస్పీ కిశోర్ ప్రకటించారు. పాకిస్థానీలు ఎవరు ఉండకూడదన్నారు. జిల్లా పరిధిలో ఎవరైనా పాకిస్థానీయులు ఉంటే వెంటనే వెళ్లిపోవాలని ఈ నిబంధనలు పాటించని వ్యక్తులపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. అటువంటి వ్యక్తులు సంబంధిత పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇచ్చి దేశం విడిచి వెళ్లాలని సూచించారు. లేకుంటే వీసా నియమావళి ఉల్లంఘన, ఇతర చట్ట ఉల్లంఘనల కింద కఠినమైన, న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు

చాట్రాయి, ఏప్రిల్ 26 (ఆంధ్ర జ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదులు 26 మంది టూరిస్టులను కాల్చి చంపిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం కృష్ణారావుపాలెం తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ రూటులో తిరిగే అన్ని వాహనాలను ఆపి తనిఖీ చేసి పలువురిని ప్రశ్నించారు. మైనర్లు, లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి ఎస్సై రామకృష్ణ కౌన్సెలింగ్ ఇచ్చారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దు

ముదినేపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముదినేపల్లి ఎస్ఐ వీఎస్ వీరభద్రరావు తెలిపారు. శనివారం ముదినేపల్లిలో పోలీస్ సిబ్బం దితో కలిసి ఆయన వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలు నడుపుతున్న మైనర్లు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనాలు డ్రైవ్ చేసే బాలుర తో పాటు తల్లి దండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఎస్ఐ ఎ.శ్రీనివాస్ పాల్గొ న్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

ఆగిరిపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు సురక్షిత ప్రయా ణానికి హెల్మెట్ తప్పనిసరిగా ధరించా లని ఎస్సై శుభశేఖర్ సూచించారు. ఆగిరిపల్లిలో శనివా రం హెల్మెట్ లేకుండా నడుపుతున్న వారిని ఆపి హెల్మెట్ వాడకం వల్ల కలిగే ప్రయో జనాలను వివరించారు. ప్రతిఒక్కరూ హెల్మె ట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	124, 133, 144
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

పాఠశాలకు ప్రయోగ పరికరాలు


రమణక్కపేటలో సామగ్రితో టీచర్స్

మునునూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రయోగాలకు అవసరమైన పరికరాలను ఏలూరు పార్లమెంట్ సభ్యుడు పుట్టా మహేష్‌కుమార్ సౌజన్యంతో పాఠశాలలకు అందిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు పసుమర్తి రామకృష్ణ తెలిపారు. శనివారం రూ.4లక్షల విలువగల ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్ తదితర ప్రయోగాలకు అవసరమైన పరికరాలతో పాటు లెక్కలు, సాంఘిక శాస్త్రానికి సంబంధించిన చార్టులు, దేశ, ప్రపంచ పటాలు, శాస్త్రవేత్తలు, దేశ నాయకులు చిత్రపటాలు పాఠశాలకు చేరినట్లు హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షులు రంగు ఆంజనేయులు, జనసేన సెంట్రల్ కమిటీ సభ్యులు పాశం నాగబాబు, ఎస్ఎంసీ చైర్మన్ నీలికొండ రాజా పాల్గొన్నారు.

వినియోగంలోకి మూడు చేతి పంపులు


లోపూడిలో చేతిపంపు నుంచి వస్తున్న నీరు

మునునూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు టీడీపీ నాయకులు లక్కపాము కాంతరావు తెలిపారు. లోపూడి గ్రామంలో ఎస్సీ, బీసీ కాలనీల్లో ఐదేళ్ళుగా నిరుపయోగంగా ఉన్న మూడు చేతి పంపులను మంత్రి పార్థసారథి ఆదేశాలతో శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ మెకానిక్ మంగిశెట్టి సుబ్బారావు, సిబ్బంది మరమ్మతులు చేసి, నూతన సామాగ్రి వేసి వినియోగంలోనికి తీసుకువచ్చారు. ఈ చేతి పంపులతో రెండు కాలనీల్లో తాగునీరు సమృద్ధిగా ఉంటుందని నాయకులు తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం అడ్మిషన్లు ఉచితం

మునునూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఒకటవ తరగతిలో 25 శాతం అడ్మిషన్లు ఉచితంగా కల్పిస్తున్నట్లు ఎంఈవో బి.వి.యస్ సుబ్బారావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ నేటి నుంచి మే 15వ తేదీ లోపు సిఎస్ఈ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో అర్హులైన అభ్యర్థులు ఒకటవ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయింపు ఉంటుందన్నారు. గ్రామ సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో సైతం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కలిదిండి: ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించిన 25 శాతం సీట్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవోలు రవి ప్రకాష్, వి.శ్రీనివాసరావు అన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో పేద బలహీనవర్గాల పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయించారన్నారు. ఐదు సంవత్సరాలు నిండిన వారు ఏప్రిల్ 28 నుంచి మే 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మండలంలో 13 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని వారి నివాసం సమీపంలో పాఠశాలల్లో ప్రభుత్వం సీట్లు కేటాయిస్తుందన్నారు. మరిన్ని వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 1800 4258 599ను సంప్రదించాలన్నారు.

చాట్రాయి: ప్రైవేటు పాఠశాలల్లో ఒకటవ తరగతిలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయిస్తామని ఎంఈవో వీఎస్‌వీ బ్రహ్మాచారి తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా మే 15తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని, రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయిస్తారని తెలిపారు.

ఎక్సైజ్ పాత నేరస్తుల బైండోవర్


మునునూరులో బైండోవర్ చేసిన పాత ముద్దాయిలు

మునునూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆరుగురు ఎక్సైజ్ పాత నేరస్తులను శనివారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ రమణ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. చెక్కపల్లికి చెందిన బలిన ధర్మ, తాళం వరలక్ష్మి, నక్కా దుర్గ, లోపూడికి చెందిన మరీదు నాగేశ్వరరావు, చిల్లబోయినపల్లికి చెందిన మిడతా శ్రీను, అక్కిరెడ్డిగూడెంకు చెందిన చల్లారి మారయ్యలను ఏడాది కాలపరిమితిలో మరలా ఎక్సైజ్ నేరాలకు పాల్పడితే రూ.లక్ష జరిమానా, ప్రభుత్వ పథకాల రద్దు చేయడంతోపాటు చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ముద్దాయిలను తహసీల్దార్ హెచ్చరించారు. గ్రామాల్లో సారా తయారు చేసినా, అమ్మినా 94409 02462 నంబరుకు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.

బైండోవర్ ఉల్లంఘన: రూ.20 వేల జరిమానా

ఆగిరిపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):నూజివీడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల వ్యక్తి బైండోవర్ ఉల్లంఘించినందుకు రూ.20 వేలు జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ ఎమస్తానయ్య తెలిపారు. ఆగిరిపల్లి గ్రామానికి చెందిన పల్లగాని అంజలి భర్త శివయ్య గతంలో ఆగిరిపల్లి తహసీల్దార్ ఎదుట హాజరై ఎక్సైజ్ నేరాలు చేయనని బైండోవర్ అయ్యి మరలా ఎక్సైజ్ నేరాలు చేసి బైండోవర్ ఉల్లంఘించినందుకు శివయ్యకు రూ.20వేలు జరిమానాను తహసీల్దార్ విధించినట్లు తెలిపారు. అనంతరం ఆగిరిపల్లి మండలానికి చెందిన నలుగురు పాత నేరస్తులను ఆగిరిపల్లి తహసీల్దార్ వారి ఎదుట హాజరు పరిచి వారిని బైండోవర్ చేయటం జరిగిందని తెలిపారు.

నూజివీడు టౌన్: నూజివీడు మండలం ఒగిరాల తండాకు చెందిన గాంధీ బైండోవర్ అయ్యి మరలా ఎక్సైజ్ నేరం చేసినందుకు రూ.10000 జరిమానాను నూజివీడు తహసీల్దార్ విధించినట్లు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. అనంతరం నూజివీడు మండలానికి చెందిన 8 మంది పాత నేరస్తులను తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు.



ఉగ్రవాదాన్ని అణిచి వేయాలి

ముదినేపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కాశ్మీర్‌లో పహల్గామ్‌లో ఇటీవల ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తూ ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకురాలు రెడ్డి రాధిక ఆధ్వర్యంలో అల్లూరు, ఈడేపల్లి, బొమ్మినంపాడు గ్రామాలకు చెందిన మహిళలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

ఉప్పుటేరు ఆక్రమణలు తొలగించాలి

(5వ పేజీ తరువాయి)

పశ్చిమ గోదావరి జిల్లాలోని నీరంతా కొల్లేరు, ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి వెళ్లాల్సి ఉందన్నారు. ఉప్పుటేరు వెంబడి ఆక్రమించిన రైతులు తమ చెరువులన్నీ రొయ్యలు, చేపలను ఖాళీ చేసి అప్పగించాలన్నారు. కొల్లేరు ప్రజలకు కాంటూరు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామని సుప్రీంకోర్టు ఇచ్చిన 12 వారాల గడువులో పక్షులు, పర్యావరణంతో పాటు ప్రజలు ఉన్నట్టు గుర్తించిం దన్నారు. త్వరలోనే ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. రాష్ట్ర టీడీపీ వడ్డీ సాధికారిక కమిటీ కన్వీనర్ బలే ఏసురాజు, రాష్ట్ర చేపల రైతు సంఘం అధ్యక్షుడు నంబూరి వెంకటరామరాజు, ఎంపీపీ అడవి కృష్ణ, కూటమి నాయకులు పెన్మెత్స త్రినాథరాజు, పొత్తూరి వాసురాజు, పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.


కొల్లేరు చిత్రపటం పరిశీలిస్తున్న నాయకులు

కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపండి : సీపీఎం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కొల్లేరును 5 నుంచి మూడో కాంటూరుకు కుదిం చి.. ఉపాధి, అభివృద్ధి పనులు చేపట్టి ప్రభుత్వం అక్కడి ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నా రు. కొల్లేరు గ్రామాల్లో శనివారం సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకుల బృందం పర్యటించి మాధవపురం పక్షుల కేంద్రం, పెద ఎడ్లగాడి వద్ద కొల్లేరు ప్రాంతాన్ని పరిశీలించింది. గుడివాకలంక, కలకుర్రు గ్రామాల్లో జరిగిన సభల్లో అక్కడి గ్రామస్తులు తాతపూడి చందు, దొరబాబు, కొల్లేరు నాయకులు, ఇతర పెద్దలు మాట్లాడుతూ 2006 నుంచి వారు పడుతున్న కష్టాలను వివరించారు. ఉపాధి లేక ఇక్కడి ప్రజలు వలసపోతున్నారని, కొల్లేరు ప్రాంతమన్న పేరుతో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిపివేశామన్నారు. ఐదో కాంటూరులో లేని గ్రామాలను, జిరాయితీ భూములను సైతం ధ్వంసం చేశారని తెలిపారు. కొవ్వాడ లంక గ్రా మాల్లో ప్రజలకు సెంటు భూమి కూడా లేకుండా పోయిందన్నారు. ఆయా సభల్లోనూ, పేద ఎడ్ల గాడి వంతెనపై మీడియాతోనూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ భవిష్యత్ ఏమిటన్న భయం కొల్లేరు ప్రజల్లో కనబడుతోందన్నారు. ప్రభుత్వం సుప్రీం కోర్టులో ఆఫడవిట్ వేసి వాస్తవ పరిస్థితులను కోర్టుకు వివరించాలని శ్రీనివాసరావు ముందుగా అఖిల పక్షం సమావేశం ఏర్పాటు చేసి ఇక్కడి ప్రజలకు అభయమి చ్చి కలిసి కట్టుగా ముందుకు సాగేలా చూడాలని ప్రభుత్వానికి సూచించారు. కొల్లేరు కాంటూరు లెక్కలన్ని కాకి లెక్కలుగా ఉన్నాయని, శాస్త్రీయత లేకుండా నిర్ధారించారన్నారు.ఈ కా ర్యక్రమలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర సీనియర్ నాయకులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి

మండవల్లి: 20 ఏళ్లుగా కొల్లేరు సమస్యను ఏ ప్రభుత్వాలు పట్టించుకోలేదని కూటమి ప్రభుత్వం అయినా సుప్రీంకోర్టులో కొల్లేరు ప్రజల సమస్యలను వాదించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు కోరారు. మండవల్లి మండలం కొవ్వాడలంక గ్రామస్తులతో శనివారం సమావేశం నిర్వహించారు. కాంటూరు కుదింపు విషయంలో అటవీశాఖ బ్రిటిష్ నాటి మ్యాపులతోనే నేటికి సర్వేలు చేస్తుందని అప్పటి నుంచి ఇప్పటివరకు కాంటూరులో ఎన్నో మార్పులు వచ్చాయని వివరించారు. ప్రస్తుతం కొవ్వాడలంక ప్రాంతంలోని కొల్లేరు మొత్తం 5వ కాంటూరు వెలుపల ఉంటుందని తెలిపారు. విజయవాడ ముంపుకు కొల్లేరుకు ఎటువంటి సంబంధం లేదని పేద ప్రజల నోటి కాడి కూడును లాగేసుకుంటున్నారని ఆరోపించారు. సీపీఎం నాయకులు మంతెన సీతారాం బలరాం రవిప్రసాద్ కొవ్వాడలంక సర్పంచ్ తిరుపతి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.పాల్గొన్నారు.

వేతన బకాయిలు విడుదల చెయ్యాలి

చాట్రాయి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్తపూరు గ్రామంలో 2 నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు విడుదల చెయ్యకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే వేతనాలు బ్యాంకు ఖాతాలకు జమ చెయ్యాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ అనుబంధ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి పుల్లారావు డిమాండ్ చేశారు. శనివారం సంఘం నాయకులు పని ప్రదేశానికి వెళ్ళి కూలీలతో మాట్లాడారు.

కీబోర్డు ప్లేలో గిన్నిస్ బుక్‌లో స్థానం


కాంద్రు కుటుంబీకులు

మండవల్లి ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం భైరవపట్నం గ్రామంలోని కంద్రు ఫ్యామిలీకి చెందిన కాంద్రు కిరణ్‌బాబు, అలెగ్జాండర్, కేరెన్ జాస్పెర్ అనే ముగ్గురుకి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించారు. విజయవాడకు చెందిన హలెల్ మ్యూజిక్ స్కూల్ తరఫున పాస్టర్ ఆగస్టిన్ దండింగి సారధ్యంలో డిసెంబరు 1వ తేదీన కీబోర్డ్‌ను 18 దేశాల నుంచి గంట వ్యవధిలో ఒకేసారి 1090 మంది ప్లే చేసి ఇన్‌స్టాగ్రాములో అప్లోడ్ చేశారు. దీనిని గిన్నీస్ వరల్డ్‌రికార్డ్ వారు గుర్తించి గిన్నీస్ వరల్డ్‌రికార్డులో స్థానం కల్పించారు. ఈనెల 25వ తేదీన గిన్నిస్ వరల్డ రికార్డు నిర్వాహకులు విజయవాడలోని గుణదలలో సర్టిఫికెట్ అందించారు.



పెదగొన్నూరులో హైస్కూలు అధ్యాపకులు ఏర్పాటు చేసిన ప్రచార ఫ్లెక్సీ

హైస్కూళ్లలో ప్రవేశాలకు విస్తృత ప్రచారం

ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన ఉపాధ్యాయులు

ముదినేపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠ శాలల్లో విద్యార్థులను చేర్పిం చేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎస్ఎంసీ కమిటీలు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టారు. ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీ పిల్లలను ఒకటవ తరగతిలో చేర్పించటం మండలంలో 70 శాతం పూర్తి కాగా ఎలిమెంటరీ పాఠశాలల్లో ఐదవ తర గతి పూర్తి చేసిన విద్యార్థులను జిల్లా పరిషత్ హైస్కూళ్లలో ఆరవ తరగతిలో చేర్పించేందుకు అధ్యాపకులు విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ ఏడాది పదవ తరగతిలో సాధించిన ఉత్తీర్ణత శాతం, మార్కులతో ప్రచురించిన ఫ్లెక్సీలను మండలంలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరిస్తున్నారు. ముదినేపల్లి, పెదపాలపర్రు, గురజ, బొమ్మినంపాడు, వడాలి, చిగురుకోట, అల్లూరు, పెదగొన్నూరు హైస్కూళ్లతోపాటు, కొత్తగా మంజూరైన వైవాక, సింగరాయపాలెం జిల్లా పరిషత్ హైస్కూళ్లలో విద్యార్థులను చేర్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.